కష్టమర్ల విశ్వాసానికి..
పారదర్శక విధానాలకు..
ప్రతిరూపం
MESARA
Infra Developers Limited



BNS
BHARAT NEWS SPECTRUM
ది న్యూ వాయిస్ ఆఫ్ న్యూ భారత్



కష్టమర్ల విశ్వాసానికి..
పారదర్శక విధానాలకు..
ప్రతిరూపం
MESARA
Infra Developers Limited



సంపుటి - 01 సంచిక -219 తెలంగాణ ఆంధ్రప్రదేశ్ 20-08-2026 గురువారం పేజీలు : 4


# కొండా వర్సెస్ రేవంత్!



- కొండా కుటుంబాన్ని కాదని రేవూరికే మద్దతా?
- 'మా నాన్నకు ఎమ్మెల్సీ ఎందుకు ఇవ్వలేదు?'
- రేవంత్‌పై సుస్మిత ఘాటు ప్రశ్నల వర్షం
- 'ముఖ్యమంత్రి అయ్యాక కళ్లు నెత్తికెక్కాయా?'
- 'బీసీలంటే అంత చులకనా..?' అంటూ ఫైర్
- 'కొండా కుటుంబం లేకపోతే రేవూరి గెలిచేవాడా?'
- 'పొంగు ఎక్కువ సేపు పొంగదు'.. సుస్మిత వార్నింగ్
- 'అప్‌కమింగ్ ఎమ్మెల్యే పరకాల'.. సుస్మిత హింట్

**న్యూస్ డెస్క్, 19 ఆగష్టు (బిఎన్‌ఎస్):** తెలంగాణ కాంగ్రెస్‌లో పరకాల అసెంబ్లీ నియోజకవర్గ రాజకీయాలు రోజురోజుకూ వేడెక్కుతున్నాయి. వచ్చే అసెంబ్లీ ఎన్నికల్లో సిట్టింగ్ ఎమ్మెల్యే రేవూరి ప్రకాశ్‌రెడ్డిని మరోసారి భారీ మెజార్టీతో గెలిపించాలని సీఎం రేవంత్‌రెడ్డి ఇటీవల సభలో పిలుపునివ్వడం ఇప్పుడు ఉమ్మడి వరంగల్ జిల్లా కాంగ్రెస్‌లో చర్చనీయాంశంగా మారింది. ఈ వ్యాఖ్యలపై మంత్రి కొండా సురేఖ కుమార్తె కొండా సుస్మిత తీవ్రస్థాయిలో ఫైరయ్యారు. పరకాల నుంచి రేవూరిని మళ్లీ పోటీ చేయిస్తామని సీఎం ఎలా ప్రకటిస్తారని ప్రశ్నిస్తూ రేవంత్‌రెడ్డి, వరంగల్ జిల్లా ఇంఛార్జ్ మంత్రి పొంగులేటిని శ్రీనివాస్ రెడ్డిని ఉద్దేశించి పరోక్షంగా ఘాటు వ్యాఖ్యలు చేశారు.


మిగతాది 2 లో..


# 7,437 పోస్టులకు నోటిఫికేషన్

- సెప్టెంబర్ 9 వరకు దరఖాస్తుల స్వీకరణ
- 3,697 సివిల్ కానిస్టేబుల్ పోస్టులు
- ఎస్ఐ, కానిస్టేబుల్ పోస్టులతో భారీ భర్తీ
- ఆధార్ ఫేస్ అథెంటికేషన్ తప్పనిసరి
- tgprb.inలో దరఖాస్తు చేసుకోండి
- వయోపరిమితి పెంపుతో భారీ పోటీ




**న్యూస్ డెస్క్, 19 ఆగష్టు (బిఎన్‌ఎస్):** తెలంగాణ రాష్ట్రంలో పోలీసు, అనుబంధ విభాగాల్లో ఖాళీగా ఉన్న మొత్తం 7,437 ఉద్యోగాల నియామక ప్రక్రియ బుధవారం ఉదయం 8 గంటల నుంచే ప్రారంభం అయింది. తెలంగాణ రాష్ట్ర స్థాయి పోలీసు నియామక బోర్డు (టీజీపీఆర్‌బీ) ఆధ్వర్యంలో నిర్వహించే ఈ ప్రక్రియ కోసం అభ్యర్థులు అధికారిక వెబ్‌సైట్ tgprb.in లో దరఖాస్తులు సమర్పించవచ్చు. సెప్టెంబర్ 9వ తేదీ సాయంత్రం 5 గంటల వరకు అప్లికేషన్లకు అవకాశం ఉంది. ఈ నియామకాల్లో పోలీసు, స్పెషల్ ప్రొటెక్షన్ ఫోర్స్ (ఎస్పీఎఫ్), ఫైర్ సర్వీసెస్, జైళ్ల శాఖ విభాగాల్లోని పోస్టులను భర్తీ చేయనున్నారు.


2 లో


# డబ్బుల కోసం ప్రిన్సిపల్ హత్య



● గంజాయి మత్తులో దారుణ హత్య ● 27 సార్లు కత్తితో దాడి ● హైదరాబాద్‌లో డబ్బుతో జల్సాలు ● ఇద్దరు విద్యార్థులను అరెస్ట్ చేసిన పోలీసులు


2 లో


# ఉచిత పథకాలపై హైకోర్టు కీలక ప్రశ్న

- కల్యాణలక్ష్మి, షాదీముబారక్‌పై విచారణ
- భూ బాధితుల పరిహారంపై ఆదేశాలు
- ఉచిత పథకాలకు నిధులపై కోర్టు సూచన
- స్టే ఎత్తివేయాలని ప్రభుత్వ విజ్ఞప్తి




**న్యూస్ డెస్క్, 19 ఆగష్టు (బిఎన్‌ఎస్):** తెలంగాణ ప్రభుత్వానికి తెలంగాణ ఉన్నత న్యాయస్థానం (హైకోర్టు)లో కీలక పరిణామం ఎదురైంది. రాష్ట్రంలో అమలు చేస్తున్న ఉచిత సంక్షేమ పథకాలు, భూసేకరణ బాధితులకు చెల్లించాల్సిన నష్టపరిహారం వివాదంపై విచారణ సందర్భంగా హైకోర్టు ధర్మాసనం పలు కీలక వ్యాఖ్యలు చేసింది. కల్యాణలక్ష్మి, షాదీ ముబారక్ వంటి పథకాల అమలు, భూసేకరణ బాధితుల పిటిషన్లపై విచారణ సందర్భంగా కోర్టు స్పందిస్తూ చట్టబద్ధత లేని ఉచిత పథకాల కోసం ప్రజాధనాన్ని వృథాగా ఖర్చు చేస్తే ఎలా అని ప్రశ్నించింది.


2 లో


# ఏపీ రాజకీయాల్లో మరో సంచలన పరిణామం



- విజయసాయిరెడ్డి కొత్త పార్టీ ప్రకటన
- త్వరలో కొత్త పార్టీ ఏర్పాటు
- ప్రజల పక్షంగా కొత్త రాజకీయ వేదిక
- ఈ నెలలోనే పార్టీ ప్రక్రియ ప్రారంభం
- పార్టీ పేరు, అజెండాపై త్వరలో స్పష్టత


2 లో


# పొంగులేటిని బర్తరఫ్ చేయాలి



- 22ఏ వివాదంపై హరీశ్ రావు ఫైర్
- రేవంత్‌కు తెలియకుండానే జరిగిందా
- పది రోజుల్లో మాట మార్చారన్న హరీశ్
- 22ఏ బాధితులకు హరీశ్ భరోసా
- ప్రభుత్వ నిర్ణయాలపై తీవ్ర విమర్శలు
- రేవంత్‌పై హరీశ్ రావు ప్రశ్నల వర్షం


2 లో


# మరో ఏడాదిలో పాదయాత్ర

- స్థానిక ఎన్నికలకు ఇప్పటి నుంచే సిద్ధం
- ఎన్నికలు ఎప్పుడు జరిగినా మనదే విజయం
- కూటమి ప్రభుత్వంపై తీవ్ర వ్యతిరేకత
- పార్టీ బలోపేతమే లక్ష్యంగా పనిచేయాలి
- ప్రజా సమస్యలపై జగన్ ఫోకస్
- ఎన్నికలే లక్ష్యంగా వైసీపీ వ్యూహం



**న్యూస్ డెస్క్, 19 ఆగష్టు (బిఎన్‌ఎస్):** స్థానిక ఎన్నికల్లో సత్తా చాటాలి అంటూ వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ నతలకు దిశానిర్దేశం చేశారు వైసీపీ అధినేత, మాజీ సీఎం వైఎస్ జగన్మోహన్ రెడ్డి.. తాడేపల్లిలోని వైసీపీ కేంద్ర కార్యాలయంలో రాజమండ్రి రూరల్ అసెంబ్లీ నియోజకవర్గానికి చెందిన వైసీపీ నేతలతో జగన్ సమావేశమయ్యారు. ఈ సందర్భంగా రాబోయే స్థానిక సంస్థల ఎన్నికలకు పార్టీ శ్రేణులు సిద్ధం కావాలని, గెలుపే లక్ష్యంగా పనిచేయాలని ఆయన పిలుపునిచ్చారు.

స్థానిక సంస్థల ఎన్నికల పోరుకు ఇప్పటి నుంచే సిద్ధం కావాలని జగన్ పార్టీ నేతలకు సూచించారు. ప్రజల్లో కూటమి ప్రభుత్వంపై తీవ్ర వ్యతిరేకత ఉందని, ఏ ఒక్క వర్గం కూడా ప్రభుత్వ పాలనతో సంతోషంగా లేదని ఆయన వ్యాఖ్యానించారు. ప్రజల్లో ఉన్న వ్యతిరేకత స్థానిక ఎన్నికల్లో కనిపించకుండా చేసేందుకు పోలీసులు, అధికార యంత్రాంగాన్ని ఉపయోగించే అవకాశం ఉందని ఆరోపించిన జగన్.. ఎలాంటి పరిస్థితులు ఎదురైనా వాటిని ఎదుర్కొని పోరాడాలని పార్టీ శ్రేణులకు సూచించారు. తమ పార్టీకి ప్రజల్లో అత్యంత ఆదరణ ఉందని జగన్ పేర్కొన్నారు. అందువల్ల రాబోయే ఎన్నికల్లో వైసీపీ తప్పకుండా విజయం సాధిస్తుందని ధీమా వ్యక్తం చేశారు. నిత్యం ప్రజలతో మమేకమై పనిచేస్తూ పార్టీ బలోపేతానికి కృషి చేయాలని నేతలకు సూచించారు.


2 లో



# మిడ్ డే మీల్‌పై తీవ్ర కలకలం

- ఉప్పుకు బదులు డిటర్జెంట్ కలకలం
- మధ్యాహ్న భోజనంతో 36 మందికి అస్వస్థత
- భోజనం చేసిన వెంటనే వాంతులు
- విద్యార్థులను ఆసుపత్రికి తరలింపు
- ప్రమాదం నుంచి బయటపడ్డ విద్యార్థులు
- ఘటనపై సమగ్ర విచారణకు ఆదేశం


2 లో


# మహారాష్ట్ర సర్కార్ సంచలనం

- మహారాష్ట్రలో మత స్వాతంత్ర్య చట్టం అమలు
- బలవంతపు మతమార్పిడులపై సర్కార్ కొరడా
- మతమార్పిడికి ఏడేళ్ల వరకు జైలు
- నేరాలకు భారీ జరిమానాలు విధించేలా
- మైనర్లు, మహిళలకు ప్రత్యేక రక్షణ నిబంధనలు
- పదేపదే నేరాలకు పదేళ్ల జైలు
- ఆగస్టు 28 నుంచి చట్టం అమల్లోకి


२ महाराष्ट्र शासन राजपत्र असाधारण भाग चार-ब, ऑगस्ट १७, २०२६/श्रावण २६, शके १९४८

HOME DEPARTMENT

Madam Cama Marg, Hutatma Rajguru Chowk, Mantralaya, Mumbai 400 032, Dated 17th August, 2026.

NOTIFICATION

MAHARASHTRA FREEDOM OF RELIGION ACT, 2026.

No.NAX-0724/C.R.240/Spl-1B.—In exercise of the powers conferred by sub-section (2) of section 1 of the Maharashtra Freedom of Religion Act, 2026 (Mah. XLVII of 2026), the Government of Maharashtra hereby appoints 28th August, 2026 to be the date on which the provisions of the said Act shall come into force.

By order and in the name of the Governor of Maharashtra,

PRITAMKUMAR JAWALE,
Deputy Secretary to Government.

ON BEHALF OF GOVERNMENT PRINTING, STATIONERY AND PUBLICATION, PRINTED AND PUBLISHED BY DIRECTOR, SMT. MANISHA KUMBHAR, PRINTED AT GOVERNMENT CENTRAL PRESS, 21-A, NETAJI SUBHASH ROAD, CHARNI ROAD, MUMBAI 400 004 AND PUBLISHED AT DIRECTORATE OF GOVERNMENT PRINTING, STATIONERY AND PUBLICATIONS, 21-A, NETAJI SUBHASH ROAD, CHARNI ROAD, MUMBAI 400 004. EDITOR : DIRECTOR, SMT. MANISHA KUMBHAR.

**న్యూస్ డెస్క్, 19 ఆగష్టు (బిఎన్‌ఎస్):** మహారాష్ట్ర ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుంది. రాష్ట్రంలో బలవంతపు, మోసపూరిత మతమార్పిడులను నిరోధించేందుకు ఉద్దేశించిన 'మహారాష్ట్ర మత స్వాతంత్ర్య చట్టం, 2026'ను అమల్లోకి తెస్తూ ప్రభుత్వం అధికారికంగా గెజెట్ నోటిఫికేషన్ జారీ చేసింది. ఈ నూతన చట్టం ఆగస్టు 28, 2026 నుంచి రాష్ట్రవ్యాప్తంగా అమల్లోకి రానుంది. ఈ మేరకు మహారాష్ట్ర గవర్నర్ ఆదేశాల మేరకు ప్రభుత్వ డిప్యూటీ సెక్రటరీ ప్రితమ్‌కుమార్ జావళే గెజిట్ ఉత్తర్వులను జారీ చేశారు.


2 లో


# తెలంగాణ ఫోక్ ఇండస్ట్రీలో కలకలం

- ఫోక్ ఆర్టిస్టుల వ్యవహారం బట్టబయలు
- భార్య ఫిర్యాదుతో పోలీసుల విచారణ
- రెడ్డి భవన్‌లో ఇద్దరు ఆర్టిస్టులు
- రెడ్‌హ్యాండెడ్‌గా పట్టుకున్న భార్య
- పోలీసుల అదుపులో ఇద్దరు ఆర్టిస్టులు
- ఘటనపై పూర్తి వివరాలు తెలియాల్సి ఉంది


2 లో


# జగన్‌కు రాజకీయాలు అవసరమా:చంద్రబాబు

- జగన్ తీరుపై చంద్రబాబు తీవ్ర విమర్శలు
- అసెంబ్లీ బహిష్కరణపై సీఎం ఫైర్
- ప్రజాసమస్యలపై సభలోనే పోరాటం
- గ్రూప్-1 అక్రమాలపై జగన్‌పై ఆరోపణలు
- డీఎస్సీపై తప్పుడు ప్రచారం చేస్తున్నారన్న సీఎం
- బీసీ రిజర్వేషన్లపై జగన్‌కు చంద్రబాబు కౌంటర్


2 లో

BNS BHARAT NEWS SPECTRUM
ది న్యూ వాయిస్ ఆఫ్ న్యూ భారత్



# మిడ్ డే మీల్‌పై తీవ్ర కలకలం



**న్యూస్ డెస్క్, 19 ఆగష్టు (బిఎన్ఎస్):** పాఠశాలలో వడ్డించిన మిడ్ డే మీల్ విషయంలో జరిగిన ఒక చిన్న పొరపాటు విద్యార్థులను తీవ్ర అస్వస్థతకు గురయ్యేలా చేసింది. మధ్యాహ్న భోజనంలో ఉప్పుకు బదులు డిటర్జెంట్ పౌడర్ వేయడంతో 36 మంది విద్యార్థులు సిక్ అయ్యారు. ఈ షాకింగ్ ఘటన బిహార్ లోని నలంద జిల్లా నూర్ సరే పోలీస్ స్టేషన్ పరిధిలోని పరసి ప్రభుత్వ మిడిల్ స్కూల్‌లో వెలుగు చూసింది. ప్రిన్సిపాల్ శైలేంద్ర కుమార్ సింగ్ తెలిపిన వివరాల ప్రకారం.. ఈ పాఠశాల విద్యార్థుల కోసం నిర్దేశించిన మెనూ ప్రకారం సోయాబీన్ అన్నంతో కూడిన మధ్యాహ్న భోజనాన్ని ఒక ఎన్జీవో సరఫరా చేసింది.

**ఉప్పుకు బదులు సర్ఫ్:**

అయితే ఆ ఆహారంలో ఉప్పు సరిగా లేదని కొందరు పిల్లలు చెప్పడంతో పాఠశాల వంటగదిలో ఒకే చోటు ఉన్న ఉప్పు, డిటర్జెంట్ పౌడర్ డబ్బాలలో పొరపాటున ఉప్పుకు బదులు డిటర్జెంట్?ను తీసుకుని ఆహారంలో కలిపాడు. భోజనం చేసిన వెంటనే పలువురు విద్యార్థులకు తల తిరగడం, వాంతులు చేసుకోవడం ప్రారంభించారు. వారికి మొదట పాఠశాలలోనే ప్రథమ చికిత్స అందించినా పరిస్థితి మెరుగుపడకపోవడంతో తరువాత సదర్ ఆసుపత్రికి తరలించారు.

**విచారణకు ఆదేశం:**

సివిల్ సర్జన్ డాక్టర్ జయ ప్రకాష్ సింగ్ ఆసుపత్రిని సందర్శించి విద్యార్థుల పరిస్థితిని సమీక్షించారు. పిల్లలందరూ ప్రమాదం నుంచి బయటపడ్డారని ఆయన తెలిపారు. బీహార్ గ్రామీణాభివృద్ధి శాఖ మంత్రి శ్రవణ్ కుమార్ ఆసుపత్రిని సందర్శించి బాధితులైన విద్యార్థులను కలిశారు. విద్యార్థుల ఆరోగ్య పరిస్థితిపై వైద్యుల వద్ద ఆరా తీశారు. మధ్యాహ్న భోజనం తయారీ, వడ్డన వరకు ఏం జరిగిందో నిర్ధారించడానికి సమగ్ర విచారణ నిర్వహిస్తామని కుమార్ తెలిపారు. ఈ ఘటన స్థానికంగా తీవ్ర కలకలం రేపింది.

## జగన్‌కు రాజకీయాలు అవసరమా: చంద్రబాబు



**న్యూస్ డెస్క్, 19 ఆగష్టు (బిఎన్ఎస్):** శాసనసభ సమావేశాలను బహిష్కరించాలని నిర్ణయించిన వైసీపీ అధినేత, మాజీ సీఎం వైఎస్ జగన్ మోహన్ రెడ్డి వైఖరిపై ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు తీవ్రస్థాయిలో ధ్వజమెత్తారు. అమరావతిలో మీడియా ప్రతినిధులతో నిర్వహించిన చిట్‌చాట్ సీఎం మాట్లాడారు. "సభను ఒక పార్టీ మొత్తం బహిష్కరించడం నా సుదీర్ఘ రాజకీయ జీవితంలో ఏనాడూ చూడలేదు. అసెంబ్లీలో ప్రజా సమస్యలపై చర్చిస్తేనే వాటికి విలువ, గుర్తింపు ఉంటాయి. సభకు రాకుండా బయట కూర్చొని ఎంత మాట్లాడినా దానికి ఏమాత్రం ప్రాధాన్యం ఉండదు. నేను ఎన్నో ఏళ్లుగా ప్రతిపక్ష నేతగా పనిచేశాను. 2019-2024 మధ్య నేను సవాల్ చేసి అసెంబ్లీ నుంచి బయటకు వచ్చినప్పటికీ, మా పార్టీ ఎమ్మెల్యేలు చివరి వరకూ సభలోనే ఉంటూ ప్రజా సమస్యలపై పోరాటం చేశారు. ఏనాడూ అసెంబ్లీకి వెళ్లకుండా తప్పించుకోలేదు. కానీ వైసీపీ నేతల తీరు అత్యంత వింతగా ఉంది" అని సీఎం మండిపడ్డారు. ప్రజాస్వామ్యాన్ని చులకన చేస్తున్న జగన్‌కు అసలు రాజకీయాలు అవసరమా అనే అనుమానం ప్రజల్లో కలుగుతోందని వ్యాఖ్యానించారు.

గ్రూప్-1 అక్రమాలు కప్పిపుచ్చుకునేందుకే..

గత ప్రభుత్వ హయాంలో జరిగిన గ్రూప్-1 అక్రమాలను కప్పిపుచ్చుకునేందుకే జగన్ సభకు రాకుండా తప్పించుకుంటున్నారని, డీఎస్సీ అంశంపై తప్పుడు ప్రచారం చేస్తూ బురదజల్లుతున్నారని ఆరోపించారు. గతంలో జగన్ ప్రభుత్వం కోత పెట్టిన బీసీ రిజర్వేషన్లను తమ ప్రభుత్వం పునరుద్ధరించిందని, ఈ చారిత్రాత్మక నిర్ణయాన్ని రాష్ట్రంలోని అన్ని వర్గాల ప్రజలు స్వాగతిస్తుంటే, జగన్ ఇంకా తప్పుడు ప్రచారాలు చేయడం హాస్యాస్పదంగా ఉందని చంద్రబాబు పేర్కొన్నారు.

# డబ్బుల కోసం ప్రిన్సిపల్ హత్య



**న్యూస్ డెస్క్, 19 ఆగష్టు (బిఎన్ఎస్):** నల్లగొండ జిల్లా కొండమల్లేపల్లిలోని నాగార్జున స్కూల్ ప్రిన్సిపల్ రూపారెడ్డి హత్య కేసులో సంచలన నిజాలు వెలుగులోకి వచ్చాయి. పాఠాలు చెప్పిన గురువునే, డబ్బుల కోసం ఇద్దరు పదో తరగతి విద్యార్థులు దారుణంగా కత్తితో పొడిచి చంపినట్లుగా పోలీసులు నిర్ధారించారు. సమాజంలో రోజురోజుకూ పెరిగిపోతున్న చెడు వ్యసనాలు, గంజాయి సంస్కృతి ఎంతటి దారుణాలకు ఒడిగడుతుందో ఈ సంచలన ఘటన ప్రత్యక్ష సాక్షంగా నిలిచింది.

గంజాయి మత్తు, జల్సాల కోసమే..

పోలీసుల కథనం ప్రకారం.. హత్యకు పాల్పడిన ఇద్దరు పదో తరగతి విద్యార్థులు గంజాయికి తీవ్రంగా అలవాటు పడ్డారు. విచ్చలవిడిగా జల్సాలు చేయడానికి డబ్బులు సరిపోకపోవడంతో, తమ స్కూల్ ప్రిన్సిపల్ రూపారెడ్డి ఇంట్లో చోరీ చేయాలని పథకం వేశారు. ఈ నెల 11న సాయంత్రం 6 గంటల ప్రాంతంలో ప్రిన్సిపల్ రూపారెడ్డి స్కూల్ ముగించుకుని ఇంటికి బయలుదేరారు. ఆమె ఇంటికి చేరుకోవడానికి ముందే నిందితులు గోడ దూకి లోపలికి చొరబడ్డారు. రూపారెడ్డి తాళం తీసి లోపలికి ప్రవేశించిన సమయంలో, నిందితులు వంటగదిలో దాక్కున్నారు. ఆమె ఫ్రెష్ అయి బెడ్‌రూమ్‌లోకి వెళ్లగానే వెనక నుంచి అటాక్ చేసి, కత్తితో ఏకంగా 27 సార్లు దారుణంగా పొడిచి చంపేశారు.

నగదుతో పరారీ.. హైదరాబాద్‌లో జల్సాలు

హత్య అనంతరం రూపారెడ్డి హ్యాండ్ బ్యాగ్‌లో ఉన్న రూ.2 లక్షల నగదును ఎత్తుకెళ్లారు. పోలీసులకు చిక్కకుండా, సీసీటీవీ కెమెరాలలో ఎక్కడా పడకుండా తీవ్ర జాగ్రత్తలు తీసుకుంటూ అక్కడి నుంచి పరారయ్యారు. ఆ డబ్బుతో హైదరాబాద్ చేరుకుని విచ్చలవిడిగా జల్సాలు చేశారు. ఘటనపై కేసు నమోదు చేసిన పోలీసులు ప్రత్యేక బృందాలుగా ఏర్పడి దర్యాప్తు చేపట్టారు. సాంకేతిక ఆధారాల సహాయంతో నిందితులను ఎట్టకేలకు గుర్తించి, ఇద్దరు విద్యార్థులను అరెస్ట్ చేశారు. చదువు చెప్పి ప్రయోజకులను చేయాల్సిన గురువునే డబ్బుల కోసం దారుణంగా హత్య చేసిన ఈ ఘటన ఉమ్మడి నల్లగొండ జిల్లాలో తీవ్ర దిగ్భ్రాంతిని, తీవ్ర కలకలాన్ని రేపింది.

## తెలంగాణ ఫోక్ ఇండస్ట్రీలో కలకలం



**న్యూస్ డెస్క్, 19 ఆగష్టు (బిఎన్ఎస్):** తెలంగాణ ఫోక్ ఇండస్ట్రీలో అక్రమ సంబంధం వ్యవహారం కలకలం రేపుతోంది. ఫోక్ సాంగ్స్ ఆర్టిస్ట్ మరో యువతితో ఉండగా భార్య రెడ్ హ్యాండెడ్ గా పట్టుకోవడంతో ఈ అక్రమ వ్యవహారం బట్టబయలైంది. వివరాల్లోకి వెళ్తే వేములవాడ మున్సిపల్ పరిధిలోని రెడ్డి భవన్‌లో ఇద్దరు ఫోక్ ఆర్టిస్టులు ఉన్నట్లు సమాచారం అందడంతో, నటుడి భార్య అక్కడికి చేరుకుని వారిని రెడ్ హ్యాండెడ్‌గా పట్టుకుంది.

ఈ ఘటనపై సదరు మహిళ వేములవాడ టౌన్ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేయగా, ఆమె ఫిర్యాదు మేరకు పోలీసులు విచారణ చేపట్టినట్లు తెలుస్తోంది. ఇదిలా ఉండగా ఇటీవల విడుదలై బాగా పాపులర్ అయిన "బాసింగా బాసింగా బలాలే", "ప్రమీల ఓ ప్రమీల" వంటి ఫోక్ సాంగ్స్‌లో నటించిన ఈశ్వర సాయి, మాధురి రాథోడ్ ఈ ఘటనలో ఉన్నట్లు ప్రచారం జరుగుతోంది. ప్రస్తుతం ఇద్దరు నటీనటులు పోలీసుల అదుపులో ఉన్నట్లు సమాచారం. దీనిపై పూర్తి సమాచారం తెలియాల్సి ఉంది.

## ఏపీ రాజకీయాల్లో మరో సంచలన పరిణామం




**న్యూస్ డెస్క్, 19 ఆగష్టు (బిఎన్ఎస్):** మాజీ ఎంపీ విజయసాయిరెడ్డి కొత్త రాజకీయ పార్టీ ఏర్పాటుపై కీలక ప్రకటన చేశారు. త్వరలోనే కొత్త పార్టీని స్థాపించనున్నట్లు వెల్లడించారు. ప్రజల తరపున, ప్రజల కోసం, ప్రజా పక్షంగా పనిచేసేలా పార్టీని ఏర్పాటు చేయాలని నిర్ణయించినట్లు విజయసాయిరెడ్డి తెలిపారు. బుధవారం ఉదయం ఆయన కుటుంబంతో కలిసి శ్రీవారిని దర్శించుకున్నారు. అనంతరం మీడియాతో మాట్లాడుతూ.. తన రాజకీయ భవిష్యత్‌పై విజయసాయిరెడ్డి స్పష్టత ఇచ్చారు.

ప్రజల గొంతుకను వినిపించేందుకు నూతన రాజకీయ పార్టీని ఏర్పాటు చేస్తున్నట్లు విజయసాయిరెడ్డి చెప్పారు. ప్రజల సమస్యలను ప్రధానంగా ప్రస్తావిస్తూ.. వారి తరపున పోరాడే రాజకీయ వేదికగా కొత్త పార్టీని తీర్చిదిద్దుతామని పేర్కొన్నారు. ఈ నెలలోనే పార్టీ ఏర్పాటుకు సంబంధించిన ప్రక్రియను ప్రారంభించనున్నట్లు తెలిపారు. పార్టీ పేరు, విధివిధానాలు, జెండా, అజెండా వంటి పూర్తి వివరాలను త్వరలో వెల్లడిస్తానని చెప్పారు. తన తదుపరి రాజకీయ కార్యాచరణపై ఈ నెలలోనే స్పష్టమైన ప్రకటన చేస్తానని విజయసాయిరెడ్డి వెల్లడించారు.

మరోవైపు తిరుమల శ్రీవారిని దర్శించుకున్న సందర్భంగా దేశం సుభిక్షంగా ఉండాలని ప్రార్థించినట్లు విజయసాయిరెడ్డి తెలిపారు. ఎల్‌నినో ప్రభావం లేకుండా దేశ ప్రజలు సంతోషంగా ఉండాలని స్వామివారిని కోరుకున్నట్లు చెప్పారు. విజయసాయిరెడ్డి కొత్త పార్టీ ఏర్పాటు ప్రకటనతో ఏపీ రాజకీయాల్లో మరోసారి ఆసక్తికరమైన చర్చ మొదలైంది. ఇప్పటివరకు తన రాజకీయ భవిష్యత్‌పై కొనసాగుతున్న ఊహాగానాలకు ఆయన చెక్ పెట్టారు.

# మహారాష్ట్ర సర్కార్ సంచలనం



HOME DEPARTMENT

Madam Cama Marg, Hutatma Rajguru Chowk, Mantralaya, Mumbai 400 032, Dated 17th August, 2026.

NOTIFICATION

MAHARASHTRA FREEDOM OF RELIGION ACT, 2026.

No.NAX-0724/C.R.240/Spl-1B.—In exercise of the powers conferred by sub-section (2) of section 1 of the Maharashtra Freedom of Religion Act, 2026 (Mah. XLVII of 2026), the Government of Maharashtra hereby appoints 28th August, 2026 to be the date on which the provisions of the said Act shall come into force.

By order and in the name of the Governor of Maharashtra,

PRITAMKUMAR JAWALE,
Deputy Secretary to Government.

ON BEHALF OF GOVERNMENT PRINTING, STATIONERY AND PUBLICATION, PRINTED AND PUBLISHED BY DIRECTOR, SMT. MANISHA KUMBHAR, PRINTED AT GOVERNMENT CENTRAL PRESS, 21-A, NETAJI SUBHASH ROAD, CHARNI ROAD, MUMBAI 400 004 AND PUBLISHED AT DIRECTORATE OF GOVERNMENT PRINTING, STATIONERY AND PUBLICATIONS, 21-A, NETAJI SUBHASH ROAD, CHARNI ROAD, MUMBAI 400 004. EDITOR : DIRECTOR, SMT. MANISHA KUMBHAR.

**న్యూస్ డెస్క్, 19 ఆగష్టు (బిఎన్ఎస్):** మహారాష్ట్ర ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుంది. రాష్ట్రంలో బలవంతపు, మోసపూరిత మతమార్పిడులను నిరోధించేందుకు ఉద్దేశించిన 'మహారాష్ట్ర మత స్వాతంత్ర్య చట్టం, 2026'ను అమల్లోకి తెస్తూ ప్రభుత్వం అధికారికంగా గెజెట్ నోటిఫికేషన్ జారీ చేసింది. ఈ నూతన చట్టం ఆగస్టు 28, 2026 నుంచి రాష్ట్రవ్యాప్తంగా అమల్లోకి రానుంది. ఈ మేరకు మహారాష్ట్ర గవర్నర్ ఆదేశాల మేరకు ప్రభుత్వ డిప్యూటీ సెక్రటరీ ప్రితమ్‌కుమార్ జావళే గెజిట్ ఉత్తర్వులను జారీ చేశారు.

చట్టంలోని నిబంధనలు, శిక్షలు ఇలా..

మహారాష్ట్ర మత స్వాతంత్ర్య చట్టం-2026 ప్రకారం.. స్వచ్ఛందంగా మతం మారాలనుకునే వ్యక్తులు కనీసం 60 రోజుల ముందుగా సంబంధిత జిల్లా మేజిస్ట్రేట్ కి ముందస్తు నోటీసు ఇవ్వడం తప్పనిసరి. ఎవరైనా బలవంతంగా, మోసపూరితంగా, ప్రలోభాలకు గురిచేసి మతమార్పిడికి పాల్పడితే గరిష్టంగా ఏడేళ్ల వరకు జైలు శిక్ష, రూ.1 లక్ష వరకు జరిమానా విధిస్తారు. మైనర్లు, మహిళలు, మానసిక వికలాంగులు, ఎస్సీ/ఎస్టీ వర్గాలకు చెందిన వారిని అక్రమంగా మతం మారిస్తే 7 ఏళ్ల జైలు శిక్షతో పాటు రూ.5 లక్షల వరకు భారీ జరిమానా ఉంటుంది. ఒకవేళ ఒకసారి పెద్ద ఎత్తున మతమార్పిడులకు పాల్పడితే 7 ఏళ్ల జైలు శిక్ష, రూ.5 లక్షల జరిమానా విధిస్తారు. చివరగా పదే పదే నేరానికి పాల్పడితే నిందితులకు 10 ఏళ్ల వరకు జైలు శిక్ష పడే అవకాశం ఉంది. ఈ చట్టం కింద నమోదు అయ్యే నేరాలు నాన్-బెయిలబుల్‌గా పరిగణించనున్నారు. బాధితుల రక్తం పంచుకున్న బంధువులు ఎవరైనా ఫిర్యాదు చేస్తే పోలీసులు వెంటనే ఎఫ్ఐఆర్ నమోదు చేసే అధికారాన్ని కల్పించరు. ఈ చట్టం అమల్లోకి రావడంతో ఉత్తరప్రదేశ్, గుజరాత్, మధ్యప్రదేశ్, ఉత్తరాఖండ్ వంటి రాష్ట్రాల సరసన మహారాష్ట్ర కూడా చేరింది.

# పొంగులేటిని బర్తరఫ్ చేయాలి



**న్యూస్ డెస్క్, 19 ఆగష్టు (బిఎన్ఎస్):** సీఎం రేవంత్ రెడ్డి, మంత్రి పొంగులేటికి రియల్ ఎస్టేట్ బాగా తెలిస్తే.. బీఆర్ఎస్ కు పోరాటం తెలుసని మాజీ మంత్రి హరీశ్ రావు అన్నారు. 22 ఏ విషయంలో పది రోజుల్లోనే మంత్రి పొంగులేటి మాట మార్చారని 10 రోజుల క్రితం ఒక్క ఎకరా కూడా 22ఏ లో పెట్టలేదని చెప్పిన మంత్రి ఇప్పుడు క్షమాపణలు చెబుతున్నారని, నిషేధిత జాబితా గురించి 4 నెలల క్రితమే సీఎంకు చెప్పానని మంత్రి కోమటిరెడ్డి అంటున్నారని కోమటిరెడ్డి చెప్పినప్పుడే సీఎం ఎందుకు స్పందించలేదని నిలదీశారు. ఇదంతా సీఎం, మంత్రికి తెలియకుండానే జరుగుతోందా సీఎంకు ఈ విషయం తెలియకపోతే పొంగులేటిని బర్తరఫ్ చేయాలని డిమాండ్ చేశారు. తెలంగాణ భవన్‌లో '22ఏ ప్రొహిబిటెడ్ ల్యాండ్స్' బాధితులు హరీశ్ రావును కలిసి తమ గోడును వెళ్లబుచ్చుకున్నారు. ఈ సందర్భంగా మాట్లాడిన హరీశ్ రావు ఈ సమస్యను పరిష్కరిస్తారా లేక ప్రజల కాళ్ల కింద నలిగి పోతారా అని ప్రభుత్వాన్ని ప్రశ్నించారు.

జనతా గ్యారేజ్‌గా మారిన తెలంగాణ భవన్ బాధితులకు భరోసానిస్తాని అన్నారు. కాంగ్రెస్ సర్కారు అడ్డగోలు నిర్ణయాలతో సామాన్య కుటుంబాలు రోడ్డున పడ్డాయని, హిల్ట్ పాలసీ తీసుకొచ్చి వసూళ్లకు పాల్పడుతున్నారని ఆరోపించారు. మేడ్చల్, రంగారెడ్డి ప్రజలు హాయిగా నిద్రపోయే పరిస్థితి లేదన్నారు. కోట్లాది ప్రజల ఆస్తులను పెట్టే ధైర్యం అధికారులకు ఉంటుందా? చీటికి మాటికి విచారణలు చేసే రేవంత్ రెడ్డి దీనిపై ఎందుకు స్పందించడం లేదని నిలదీశారు.

# మరో ఏడాదిలో పాదయాత్ర..

మొదటి పేజీ తరువాయి

రాష్ట్రంలో శాంతిభద్రతల పరిస్థితి దారుణంగా దిగజారిందని వైఎస్ జగన్ విమర్శించారు. ఇసుక, మట్టి, మద్యం మాఫియాలు కొనసాగుతున్నాయని ఆరోపించారు. గంజాయి రవాణా చేస్తూ పోలీసులు పట్టుబడే స్థాయికి రాష్ట్ర వ్యవస్థలు దిగజారాయని ఆయన వ్యాఖ్యానించారు. ఇలాంటి ఘటనల నుంచి ప్రజల దృష్టిని మళ్లించేందుకు కుట్రలు జరుగుతున్నాయని ఆరోపించారు. ఇక, రాజమండ్రిలో డాక్టర్ ప్రియాంక హత్య ఘటనను కూడా జగన్ ప్రస్తావించారు. ఆమెను కారుతో పదేపదే ఢీకొట్టి దారుణంగా హత్య చేశారని, అయినప్పటికీ ఆ ఘటన బయటకు రాకుండా తొక్కిపెట్టే ప్రయత్నం చేశారని ఆరోపించారు. పోలీసులు, అధికార పార్టీకి చెందిన వారు కుమ్మక్కై వ్యవహరిస్తున్నారని ఆయన విమర్శించారు.

మరోవైపు.. కూటమి ప్రభుత్వంపై విమర్శలు గుప్పించిన జగన్.. ఎన్నికల ముందు ఇచ్చిన హామీల్లో ఏ ఒక్కదానినీ పూర్తిగా నిలబెట్టుకోలేదని ఆరోపించారు. విద్యార్థులు, రైతులు, మహిళలు, వృద్ధులు, ఉద్యోగులు, వ్యాపారులు ఇలా ఏ వర్గం కూడా ప్రభుత్వ పాలనతో సంతోషంగా లేదని అన్నారు. కూటమి ప్రభుత్వం ఏర్పడిన రెండేళ్లలోనే ప్రజల్లో తీవ్ర వ్యతిరేకత ఏర్పడిందని వ్యాఖ్యానించారు. అదే సమయంలో వైసీపీపై ప్రజాదరణ రోజురోజుకూ పెరుగుతోందని జగన్ పేర్కొన్నారు. గత ఐదేళ్ల వైసీపీ పాలనను ప్రస్తుత కూటమి పాలనతో ప్రజలు పోల్చి చూస్తున్నారని, ఈ అంశంపై ప్రతి ఇంట్లో చర్చ జరుగుతోందని అన్నారు.మరో ఏడాదిలో తన పాదయాత్ర ప్రారంభమవుతుందని జగన్ తెలిపారు. ఆ తర్వాత ఏడాదిలో ఎన్నికలు జరుగుతాయని పేర్కొంటూ.. ఎన్నికలు ఎప్పుడు జరిగినా వైసీపీదే విజయమని ధీమా వ్యక్తం చేశారు. పార్టీ నేతలు, కార్యకర్తలు నిత్యం ప్రజలతో మమేకమై పనిచేస్తూ, స్థానిక ఎన్నికలను లక్ష్యంగా చేసుకుని పార్టీని మరింత బలోపేతం చేయాలని సూచించారు వైసీపీ అధినేత వైఎస్ జగన్..

# 7,437 పోస్టులకు నోటిఫికేషన్

మొదటి పేజీ తరువాయి

ఇందులో సబ్ ఇన్‌స్పెక్టర్ (సివిల్, ఏఆర్, టీజీఎస్పీ), అసిస్టెంట్ సబ్ ఇన్‌స్పెక్టర్ (ఫింగర్ ప్రింట్ బ్యూరో), భారీ సంఖ్యలో సివిల్, ఏఆర్ కానిస్టేబుల్ పోస్టులతో పాటు ఫైర్ ఫైటర్లు, స్టేషన్ ఫైర్ ఆఫీసర్లు, జైళ్ల శాఖలో వార్డర్లు, డిప్యూటీ జైలర్ పోస్టులు ఉన్నాయి. ముఖ్యంగా 3,697 సివిల్ కానిస్టేబుల్ ఖాళీలు ఉన్నాయి.

ప్రభుత్వం ఈసారి అభ్యర్థుల వయోపరిమితిని పెంచడంతో దరఖాస్తుదారుల సంఖ్య మునుపటి కంటే భారీగా పెరిగే అవకాశం కనిపిస్తోంది. దరఖాస్తు ప్రక్రియలో ఎలాంటి అక్రమాలకు తావులేకుండా పారదర్శకత కోసం అధికారులు ఈసారి ఆధార్ ఫేస్ అథెంటికేషన్‌ను తప్పనిసరి చేశారు. దీనికోసం అభ్యర్థులు తమ ఫోన్లలో ముందుగానే ఆధార్ యాప్‌ను డౌన్‌లోడ్ చేసుకొని సిద్ధంగా ఉంచుకోవాలని సూచించారు.

దరఖాస్తు విధానం పార్ట్-1, పార్ట్-2ల ద్వారా జరుగుతుంది. అభ్యర్థులు తమ మొబైల్ నంబర్‌తో నమోదు చేసుకున్న తర్వాత అవసరమైన విద్యార్హత ధ్రువపత్రాలు, కుల, నివాస ధ్రువీకరణ పత్రాలు, పాస్‌పోర్ట్ సైజ్ ఫొటో, సంతకాన్ని నిర్దేశిత పరిమాణంలో అప్‌లోడ్ చేయాల్సి ఉంటుంది. చివరి తేదీ వరకు వేచి చూడకుండా అభ్యర్థులు తగిన సర్టిఫికెట్లతో వెంటనే దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. సకాలంలో దరఖాస్తులు పూర్తి చేసి అభ్యర్థులు తమ అర్హతకు తగ్గ పోస్టులకు పోటీపడవచ్చు.

# ఉచిత పథకాలపై హైకోర్టు కీలక ప్రశ్న

మొదటి పేజీ తరువాయి




ప్రభుత్వ రంగ సంస్థలను నష్టాల నుంచి గట్టెక్కించి లాభాల్లోకి తీసుకువస్తే.. ఆ ద్వారా వచ్చే ఆదాయాన్నీ ఇలాంటి ఉచిత పథకాలకు ఖర్చు చేయవచ్చు కదా అని ధర్మాసనం ప్రభుత్వానికి సూచించింది.

భూ బాధితుల పరిహారంపై ఆదేశాలు..

రాష్ట్రంలో వివిధ ప్రాజెక్టుల కోసం భూములు కోల్పోయిన బాధితులకు సరైన రీతిలో న్యాయం జరగక, నష్టపరిహారం కోసం ఏళ్ల తరబడి కోర్టుల చుట్టూ తిరగాల్సి వస్తోందని హైకోర్టు ఆవేదన వ్యక్తం చేసింది. ఉచిత పథకాలకు నిధులు కేటాయిస్తున్నప్పుడు, భూములు కోల్పోయిన బాధితుల విషయంలో ప్రభుత్వం ఎలాంటి చర్యలు తీసుకుంటుందో స్పష్టం చేయాలని సూచిస్తూ.. దీనిపై రేపటిలోగా సమాధానం చెప్పాలని ఆదేశించింది. కాగా, రాష్ట్రంలో పేద యువతుల వివాహాల కోసం ఆర్థిక సాయం అందించేందుకు ప్రభుత్వం 'కల్యాణలక్ష్మి', 'షాదీ ముబారక్' పథకాలను అమలు చేస్తోంది. అయితే, ఈ పథకానికి సంబంధించి తలెత్తిన కొన్ని న్యాయపరమైన అంశాలు, నిధుల వినియోగంపై గతంలో కోర్టు కొన్ని ఆదేశాలు ఇవ్వడం లేదా స్టే విధించడం జరిగింది. ఈ నేపథ్యంలో పథకం అమలు సజావుగా సాగేలా కల్యాణలక్ష్మి, షాదీముబారక్ల పై ఉన్న స్టేను ఎత్తివేయాలని ప్రభుత్వం హైకోర్టును కోరింది. ప్రభుత్వ విజ్ఞప్తి, భూ బాధితులకు సంబంధించిన పరిహారంపై స్పష్టత వచ్చేందుకు ఈ కేసు విచారణను ధర్మాసనం నేటికి వాయిదా వేసింది.

# కొండా వర్సెస్ రేవంత్!

మొదటి పేజీ తరువాయి

'సీఎం రేవంత్ రెడ్డిని నేను కొన్ని ప్రశ్నలు అడగదలుచుకున్నా. మీరు మట్నదట పీసీసీ కావాలని కోరుకున్నది కొండా సురేఖ, కొండా మురళి. ఆరోజు కొండా మరళి ఆదేశాల మేరకు కొండా సురేఖ పీసీసీగా రేవంత్ రెడ్డిని ప్రపోజ్ చేసింది. ఢిల్లీ స్థాయిలో కూడా కొండా సురేఖ ప్రపోజ్ చేసింది. పీసీసీ అయ్యాక మట్నట్టమట్నదటగా మా ఇంటికే వచ్చారు. ఆ రోజు మా ఇంటికి వచ్చి మా నాన్న కొండా మురళిని ఎమ్మెల్సీ చేస్తానని మాట ఇవ్వలేదా..? మైసమ్మ, ఎల్లమ్మ మీద ప్రమాణం చేసి చెప్పు. ఓ బీసీ బిడ్డ, ప్రజల మనిషికి ఎందుకు ఎమ్మెల్సీ ఇవ్వలేదని నేను అడుగుతున్నా. మీరు పరకాలకు వచ్చి వచ్చే ఎన్నికల్లో రేవూరి ప్రకాశ్ రెడ్డిని గెలిపించాలని చెప్పినవ్. అసలు ఎవరు రేవూరి ప్రకాశ్ రెడ్డి. పరకాల అంటే ఆయనకు తెలియదు. పరికాలకు రేవూరి ప్రకాశ్ రెడ్డి తెలియదు.

వచ్చే ఎన్నికలు ఎందుకు ఎప్పుడే రాజీనామా చేయమను చేసి గెలవమని చెప్పు. నువ్వు వచ్చి ప్రచారం చేయ్.. రేవూరి గెలుస్తడా.. కొండా కుటుంబం నుంచి గెలుస్తరా తెలుస్తది. మేం లేకపోతే రేవూరి ప్రకాశ్ రెడ్డి గెలిచేవాడే కాదు. నాలుగైదు నియోజకవర్గాల్లో కాంగ్రెస్ పార్టీని గెలిపించిన వ్యక్తి మీకు ఎందుకు గుర్తొస్తలేదు. ముఖ్యమంత్రి అయితే కళ్లు నెత్తికెక్కినయా..? నాకు భయం లేదు. చావుకు కూడా బయపడను. మా నాన్న అలా పెంచాడు. ఇవాళ మీతో పాటు ఓ పొంగు ఉన్నది.. ఆ పొంగు ఎక్కువ సేపు పొంగదు. నువ్వు ముఖ్యమంత్రివా.. ఆయన ముఖ్యమంత్రివా తెలియట్లేదు. ఇటీవల ఇందిరమ్మ ఇళ్ల పంపిణీలో హైదరాబాద్ ఇంఛార్జ్ మంత్రి పొన్నం ఫోటో వేయకుండా ఆ పొంగు ఫోటో వేశారు. బీసీలంటే అంత చులకనా..?' అని కొండా సుష్మిత హాట్ కామెంట్స్ చేశారు.

సుస్మిత చేసిన తాజా వ్యాఖ్యల నేపథ్యంలో వరంగల్ పాలిటిక్స్ రసవత్తరంగా మారాయి. ఇప్పటికే సుష్మిత తాను పరకాల నుంచి పోటీ చేసేందుకు రెడీ అయ్యాయని హింట్ ఇస్తూ 'అప్ కమింగ్ ఎమ్మెల్యే పరకాల' అని ఇన్‌స్టా పోస్టు పెట్టారు.

# అక్టోబరులో స్థానిక సంస్థల ఎన్నికలు?.. లేకపోతే ఏపీకి రూ.28 వేల కోట్లు లాస్!

**న్యూస్ డెస్క్, 19 ఆగష్టు (బిఎన్ఎస్):** ఆంధ్రప్రదేశ్ స్థానిక సంస్థల ఎన్నికలకు దాదాపుగా ముహూర్తం ఫిక్స్ అయ్యింది. బీసీ రిజర్వేషన్లు, ఓటర్ల జాబితా విడుదలకు లైన్ క్లియర్ కావడంతో ఎన్నికల ప్రక్రియ వేగవంతం అయ్యింది. అంతేకాదు ఏపీ ప్రభుత్వం ఎట్టిపరిస్థితుల్లోనూ అక్టోబర్‌లో ఎన్నికల నిర్వహించాల్సి వస్తోంది. గడువులోగా స్థానిక సంస్థల ఎన్నికలు నిర్వహించకపోతే కేంద్రం నుంచి రావాల్సి నిధులు కోల్పోయే పరిస్థితి ఉంది. ఏపీ కేబినెట్ సమావేశంలో స్థానిక ఎన్నికల నిర్వహణపై సీఎం చంద్రబాబు మంత్రులతో చర్చించారు. అక్టోబరులో ఎట్టిపరిస్థితుల్లో స్థానిక సంస్థల ఎన్నికలు నిర్వహించాల్సి ఉంటుందని.. ఒకవేళ నిర్వహించలేకపోతే కేంద్రం నుంచి నిధులు ఆగిపోతాయని చంద్రబాబు చెప్పినట్లు తెలుస్తోంది.

కేంద్రం నుంచి రాష్ట్రానికి 16వ ఆర్థిక సంఘం నిధులు రావాల్సి ఉంది.. నిధులు ఐదేళ్లలో రాష్ట్రంలోని పంచాయతీరాజ్ సంస్థలకు 16వ ఆర్థిక సంఘం సుమారు రూ.16,600 కోట్లు, పట్టణ స్థానిక సంస్థలకు రూ.12,150 కోట్లు రావాలి. ఈ నిధులు రావాలంటే కచ్చితంగా ఎన్నికలు జరగాల్సిందేనని చంద్రబాబు మంత్రులతో చెప్పినట్లు సమాచారం. రాష్ట్రంలోని ప్రతి కార్పొరేషన్, మున్సిపాలిటీకి ఎన్నికలు జరగాల్సిందేనని.. కొన్ని కార్పొరేషన్లు, మున్సిపాలిటీలకు సంబంధించి 2021లో గ్రామాల విలీనం చేశారు. కానీ ఈ అంశం కోర్టుకు చేరడంతో 23 చోట్ల మున్సిపల్ ఎన్నికలు నిర్వహించలేదు. ఈసారి ఆ 23 చోట్ల కూడా నిర్వహించాలని చెప్పినట్లు తెలుస్తోంది. దీని కోసం పిటిషన్లు దాఖలు చేసిన వారితో మాట్లాడి ఉపసంహరించుకునేలా చేయాలని సూచించారు. ఒకవేళ కుదరని పక్షంలో విలీన గ్రామాలనున పక్కన పెట్టి ఎన్నికలు నిర్వహించాలని సూచించినట్లు సమాచారం.

మరోవైపు రాష్ట్ర ఎన్నికల సంఘం కూడా స్థానిక సంస్థల ఎన్నికలపై ఫోకస్ పెట్టింది. పోలింగ్ బూతులు, ఓటర్ లిస్టులు, వార్డులకు రిజర్వేషన్లపై కసరత్తు చేస్తున్నారు. అక్టోబర్‌లో కచ్చితంగా ఎన్నికల నిర్వహించాల్సి రావడంతో ఈ కసరత్తును వేగవంతం చేశారు. మున్సిపల్ ఎన్నికలు.. జెడ్పీటీసీ, ఎంపీటీసీ.. పంచాయతీ ఎన్నికలు నిర్వహించాల్సి ఉంది. వీటిని విడివడిగా నిర్వహించే అవకాశాలు ఉన్నాయి.. కాబట్టి సమయం కూడా తక్కువగా ఉంది. కేవలం రెండు నెలల్లోనే ఈ ప్రక్రియ పూర్తి చేయాల్సి వస్తోంది. దీంతో ఎన్నికల సంఘం ఎలాంటి ఇబ్బందులు రాకుండా ఎన్నికల నిర్వహించేందుకు ప్లాన్ చేస్తోంది. ఇటు స్థానిక సంస్థల ఎన్నికలకు సంబంధించి ఏపీ ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుంది.. కార్పొరేషన్, మున్సిపాలిటీలు, నగర పంచాయతీలలో మేయర్, మున్సిపల్ ఛైర్మన్లను ప్రజలు నేరుగా ఎన్నుకునేలా ప్రత్యక్ష ఎన్నికల విధానాన్ని తీసుకొస్తున్నారు. ఈ మేరకు అసెంబ్లీలో చట్ట సవరణ బిల్లును ప్రవేశపెట్టనున్నారు. అంతేకాదు మున్సిపల్ కార్పొరేషన్లలో ఇద్దరు డిప్యూటీ మేయర్లు, మున్సిపాల్టీల్లో ఇద్దరు మున్సిపల్ వైస్‌ఛైర్మన్లను కూడా ఒకటికి తగ్గించే సవరణ బిల్లు కూడా తీసుకురానున్నారు.

# బోర్డు కనిపించకుండా.. గోడ నిర్మాణం

## రాపూరు క్రాస్‌రోడ్డులో నిబంధనలకు తూట్లు
## సూచిక బోర్డును కప్పేస్తూ నిర్మాణం
## పట్టించుకోని సంబంధిత అధికారులు




నెల్లూరు జిల్లా సైదాపురం (బిఎన్ఎస్): –నెల్లూరు జిల్లాలోని సైదాపురం మండల కేంద్రంలోని రాపూరు, పొదలకూరు, క్రాస్‌రోడ్డు వద్ద నిర్మాణాలు యథేచ్ఛగా సాగుతున్నాయన్న ఆరోపణలు వినిపిస్తున్నాయి. ప్రధాన రహదారిపై వాహనదారులకు దిశానిర్దేశం చేసే ప్రభుత్వ సూచిక బోర్డు ముందే గోడ నిర్మాణం చేపట్టడంతో గూడూరు, రాపూరు వెళ్లే మార్గాలను తెలిపే బోర్డు కొంతమేరకు కనిపించకుండా పోయింది. దీంతో ఈ మార్గంలో కొత్తగా వచ్చే వాహనదారులకు ఇబ్బందులు తప్పడం లేదు.

ప్రధాన జంక్షన్‌లో ఏర్పాటు చేసిన సైన్‌బోర్డు ప్రయాణికులకు ఎంతో కీలకం. గూడూరు 13 కిలోమీటర్ల దూరంలో ఉందని, రాపూరు వైపు వెళ్లే మార్గాన్ని సూచించే బోర్డు ప్రస్తుతం నిర్మాణం వెనుకకు వెళ్లిపోయింది. నిర్మాణం పూర్తయితే బోర్డు మరింతగా కనుమరుగయ్యే పరిస్థితి కనిపిస్తోంది. ప్రభుత్వ రహదారి పరిధి, సూచిక బోర్డుల చుట్టుపక్కల నిర్మాణాలపై సంబంధిత శాఖలు నిఘా పెట్టాల్సి ఉన్నప్పటికీ పట్టించుకోవడం లేదన్న విమర్శలు వస్తున్నాయి. నిర్మాణాలు జరుగుతున్న సమయంలోనే అధికారులు స్పందించి ఉంటే పరిస్థితి ఇంతవరకు వచ్చేది కాదని స్థానికులు అంటున్నారు.రాపూరు, పొదలకూరు క్రాస్‌రోడ్డు మండలంలోని ప్రధాన కూడలి కావడంతో నిత్యం పెద్ద సంఖ్యలో వాహనాలు రాకపోకలు సాగిస్తుంటాయి. ఇలాంటి ప్రాంతంలో సూచిక బోర్డులు కనిపించకుండా నిర్మాణాలు చేపట్టడంపై అధికారులు దృష్టి సారించాల్సిన అవసరం ఉంది. ఇప్పటికైనా సంబంధిత అధికారులు క్షేత్రస్థాయిలో పరిశీలించి నిర్మాణం ప్రభుత్వ స్థలాన్ని ఆక్రమించి చేపట్టిందా? నిబంధనలకు అనుగుణంగానే ఉందా? అనే అంశాలపై స్పష్టత ఇవ్వాలని స్థానికులు కోరుతున్నారు. సైన్‌బోర్డు పూర్తిగా కనిపించేలా చర్యలు తీసుకోవాలని వాహనదారులు ప్రయాణికులు ప్రజలు కోరుతున్నారు.

# పులివెందుల మున్సిపాలిటీ ఎన్నికను ఆపేందుకు కోర్టుకెళ్లిన వైసీపీ




బిఎన్ఎస్ న్యూస్ కడపజిల్లా ఆగస్టు 19:
పులివెందుల మున్సిపాలిటీని ఏకగ్రీవం చేసుకునేంత బలం ఉన్న వైసీపీ ఇప్పుడు భయపడుతోంది. ఎన్నికలు ఆపేందుకు విచిత్రమైన కారణాలతో కోర్టుకెళ్తున్నారు అంటూ పులివెందుల టిడిపి ఇన్చార్జి మారెడ్డి రవీంద్రనాథ్ రెడ్డి, బిటెక్ రవి మీడియా సమావేశంలో తెలిపారు. పులివెందులలో ఎదురయ్యే ఘోర పరాభవాన్ని తలచుకుని భయపడే వైఎస్సార్‌సీపీ న్యాయస్థానాల మెట్లెక్కిందని రాష్ట్ర మరియు జిల్లా తెలుగుదేశం పార్టీ నేతలు తీవ్రస్థాయిలో విమర్శిస్తున్నారు. స్థానిక సంస్థల ఎన్నికలను ప్రజాస్వామ్యబద్ధంగా ఎదుర్కొనే దమ్ము.. పులివెందుల మున్సిపాలిటీని ఏకగ్రీవం చేసుకునేంత బలం ఉన్న వైసీపీ ఇప్పుడు భయపడుతోంది అన్నారు. ఎన్నికలు ఆపేందుకు విచిత్రమైన కారణాలతో కోర్టుకెళ్తున్నారు. పులివెందులలో ఎదురయ్యే ఘోర పరాభవాన్ని తలచుకుని భయపడే వైఎస్సార్‌సీపీ న్యాయస్థానాల మెట్లెక్కిందని తెలుగుదేశం పార్టీ నేతలు తీవ్రస్థాయిలో విమర్శిస్తున్నారు. స్థానిక సంస్థల ఎన్నికలను ప్రజాస్వామ్యబద్ధంగా ఎదుర్కొనే దమ్ము, ధైర్యం ఉంటే తక్షణమే కోర్టులో వేసిన పిటిషన్లను ఉపసంహరించుకుని, ప్రత్యక్ష ఎన్నికల బరిలోకి దిగి ప్రజా తీర్పును తేల్చుకోవాలని టీడీపీ శ్రేణులు సవాల్ విసురుతున్నాయి. పులివెందుల మున్సిపాలిటీ పరిధిలో వార్డుల పునర్విభజన, విలీన గ్రామాల సర్దుబాటు వంటి సాధారణ పరిపాలనా ప్రక్రియలను సాకుగా చూపి ఎన్నికలను అడ్డుకునే ప్రయత్నం చేస్తున్నారు. ఇది జగన్ ఓటమి భయానికి నిదర్శనమని కూటమి నేతలు ఎద్దేవా చేస్తున్నారు. తమ సొంత ఇలాకాలో ప్రజలు ఎక్కడ తిరస్కరిస్తారోనన్న ఆందోళనతోనే వార్డుల మార్పు పేరుతో నాటకీయ డ్రామాలకు తెరలేపారని ఆరోపిస్తున్నారు. గతంలో స్థానిక సంస్థల్లో ఏకగ్రీవాల పేరిట ప్రజాస్వామ్యాన్ని అపహాస్యం చేసిన వారు.. నేడు ప్రజలు స్వచ్ఛందంగా ఓటు వేయడానికి సిద్ధమవుతుంటే ఆపే ప్రయత్నం చేయడం విడ్డూరంగా ఉందని అంటున్నారు. పులివెందుల అంటే ఒకప్పుడు ఒకే కుటుంబానికి కంచుకోటగా భావించిన రోజులు పోయాయని, గత సార్వత్రిక ఎన్నికలు మొదలుకొని స్థానిక ఉప ఎన్నికల వరకు ప్రజల్లో వచ్చిన స్పష్టమైన మార్పును చూసి ప్రతిపక్ష నాయకత్వం జీర్ణించుకోలేకపోతోందని భావిస్తున్నారు. కోర్టు వ్యాజ్యాల ద్వారా ఎన్నికల ప్రక్రియను వీలైనంత కాలం వాయిదా వేయించి తాత్కాలికంగా రాజకీయ ఉనికిని కాపాడుకోవడమే వైఎస్సార్‌సీపీ అసలు వ్యూహమని టీడీపీ నేతలు ఆరోపిస్తున్నారు. అయితే కోర్టు ఆదేశాలు ఎలా ఉన్నా ప్రజాక్షేత్రంలో తీర్పును ఎవరూ తప్పించలేరని స్పష్టం చేస్తున్నారు. రాష్ట్రవ్యాప్తంగా స్థానిక సంస్థల ఎన్నికల నిర్వహణకు ప్రభుత్వం వేగంగా కసరత్తు చేస్తున్న సమయంలో పులివెందుల రాజకీయం మరింత వేడెక్కింది. న్యాయపరమైన చిక్కుల పేరుతో కాలయాపన చేయకుండా, ఎన్నికల కమిషన్ నిర్దేశించే నియమ నిబంధనలకు అనుగుణంగా ప్రజా క్షేత్రంలోనే తేల్చుకోవాల్సిన సమయం ఆసన్నమైందని కూటమి పక్షాలు డిమాండ్ చేస్తున్నాయి.

# రైల్వే అసిస్టెంట్ డివిజనల్ సిగ్నల్ అండ్ టెలికమ్యూనికేషన్ ఇంజనీర్ గా దువ్వూరు వాసి

బిఎన్ఎస్ న్యూస్ కడపజిల్లా ఆగస్టు 19:
కడపజిల్లా.. మైదుకూరు నియోజకవర్గం, దువ్వూరు మండల కేంద్రానికి చెందిన ఆకుల శ్రీనివాసులు రైల్వే డిపార్ట్మెంట్ లో పనిచేస్తు, అసిస్టెంట్ డివిజనల్ సిగ్నల్ అండ్ టెలికమ్యునికేషన్ ఇంజనీర్ గా పదోన్నతి పోందారు, ఉమ్మడి దక్షిణ మధ్య రైల్వే సంకేత మరియు దూరసంచార్ విభాగంలో పనిచేస్తున్న పలువురు సీనియర్ సెక్షన్ ఇంజనీర్లు ఎల్‌డిసిఇ పరీక్షల ద్వారా గ్రూప్–బి క్యాడర్, గెజిటెడ్ అధికారులుగా ఎంపికయ్యారు. వీరిలో కడపజిల్లా, దువ్వూరు మండల కేంద్రం, ఇందిరానగర్ కాలనికీ చెందిన ఆకుల శ్రీనివాసులు తండ్రి చింతరపల్లి రామయ్య జనరల్ కేటగిరీ కింద ఎంపికయ్యారు. 2009 సంవత్సరమున సిగ్నల్ టెక్నీషియన్–II, టెలికాం టెక్నీషియన్–III, రైల్వే గార్డ్ గా శ్రీనివాసులు ఎంపిక కాగ, వీటిలో సిగ్నల్ టెక్నీషియన్ పోస్ట్ ఎంచుకుని, తర్వాత అంచెలంచెలుగా, జూనియర్ ఇంజినీర్, సీనియర్ సెక్షన్ ఇంజినీర్ గా పదోన్నతి పొంది, సికింద్రాబాద్, గుంతకల్ డివిజన్లలో పనిచేసారు, ఇప్పుడు ఎల్డీసీఈ లిమిటెడ్ డిపార్ట్మెంట్ కాంపిటీటివ్ ఎగ్జామినేషన్స్ పరీక్షలో వ్రాత, ముఖాముఖి పరీక్షలోనూ



ఉత్తమ ప్రదర్శన చేసి ఏడిఎస్టీఎఫ్ అసిస్టెంట్ డివిజనల్ సిగ్నల్ అండ్ టెలికమ్యునికేషన్ ఇంజనీర్ గ్రూప్ బి, గెజిటెడ్ ఆఫిసర్ గా పదోన్నతి పొందారు. దువ్వూరు గ్రామానికి చెందిన ఆకుల శ్రీనివాసులు రైల్వేలో ఉన్నత పదవి చేపట్టడం పట్ల వారి కుటుంబ సభ్యులు, గ్రామస్తులు హర్షం వ్యక్తం చేస్తున్నారు..

# మూల్యాంకన పద్ధతులలో మార్పు రావాలి. : కలెక్టర్

## పీఎంశ్రీ పాఠశాలలు పై కలెక్టర్ సమీక్ష




నల్లగొండ (బిఎన్ఎస్): పీఎం శ్రీ పాఠశాలల నుండి వచ్చే విద్యార్థులను చదువుతో పాటు అన్ని రంగాలలో సామర్థ్యం కలిగి ఉండేలా తీర్చిదిద్దాల్సిన అవసరం ఉందని జిల్లా కలెక్టర్ బి. చంద్రశేఖర్ అన్నారు.. జిల్లా కలెక్టరేట్ లో పీఎం శ్రీ పాఠశాలలపై జరిగిన సమీక్షా సమావేశంలో కలెక్టర్ మాట్లాడుతూ విద్యార్థులను అన్ని అంశాలలో ప్రతిభావంతులుగా తీర్చిదిద్దేందుకు వారిలో ఉన్న సృజనాత్మకతను బయటికి తీయాలని, పిఎం శ్రీ పాఠశాలల ప్రిన్సిపాల్స్, హెడ్మాస్టర్లను ఆదేశించారు. పి ఎం శ్రీ పాఠశాలలో ఉన్న ప్రతి విద్యార్థి మూల్యాంకన పద్ధతులను మార్చాలని, వారి ఆంగ్ల భాష నైపుణ్యభివృద్ధికి స్పెల్ బి పోటీ లను ఏర్పాటు చేయాలని, బాలికలలోనాయకత్వ లక్షణాలు పెంపొందించేందుకు సమాజంలో రోల్ మోడల్స్ గా ఉన్న మహిళల, ద్వారా చైతన్యం చేసే విధంగా చర్యలు తీసుకోవాలన్నారు. వచ్చే బాలల దినోత్సవం నాటికి 8, 9, 10 తరగతి విద్యార్థులకు టైపింగ్ లో ప్రావీణ్యం పొందేలా శిక్షణ ఇచ్చి ఉత్తమ విద్యార్థులను సన్మానించే విధంగా చర్యలు తీసుకోవాలని, వ్యవసాయం, ఉద్యానం, విద్యుత్తు ఉత్పత్తి, సేవా రంగాలు, బ్యాంకులు, ఇతర సంస్థల పనితీరు, పరిపాలన తదితర అంశాలను వారు స్వయంగా చూసి నేర్చుకునే విధంగా ప్రణాళిక రూపొందించాలని చెప్పారు.

# సైబర్ నేరాలపై అవగాహన కార్యక్రమం నిర్వహించిన ఎస్.ఐ చంద్రశేఖర్



బిఎన్ఎస్ న్యూస్ కడపజిల్లా ఆగస్టు 19:
జిల్లా ఎస్పీ షెల్కే నచికేత్ విశ్వనాథ్ ఐపిఎస్ ఆదేశాల మేరకు చక్రాయపేట ఎస్.ఐ చంద్రశేఖర్ ఆధ్వర్యంలో కుమార కాల్వ గ్రామాన్ని సందర్శించి గ్రామస్తులతో సమావేశమై స్థానిక సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా సైబర్ నేరాలు, ఆన్‌లైన్ మోసాలు, ఓటీపీ మోసాలపై ప్రజలకు అవగాహన కల్పించారు. అపరిచిత వ్యక్తులకు ఓటీపీ, బ్యాంకు ఖాతా వివరాలు, పాస్‌వర్డ్‌లు, వ్యక్తిగత సమాచారాన్ని ఎట్టి పరిస్థితుల్లోనూ వెల్లడించవద్దని సూచించారు. అనుమానాస్పద ఫోన్ కాల్స్, మెసేజ్‌లు, లింక్‌ల పట్ల అప్రమత్తంగా ఉండాలని, సైబర్ మోసానికి గురైతే వెంటనే పోలీసులను ఆశ్రయించాలని ఎస్.ఐ చంద్రశేఖర్ సూచించారు. గ్రామస్తుల సమస్యలను ఎప్పటికప్పుడు పోలీసుల దృష్టికి తీసుకురావాలని కోరారు.

# తెలంగాణ రాజ్యాధికార పార్టీలో పలువురి చేరిక



**బిఎన్ఎస్ న్యూస్ భూపాలపల్లి**
తెలంగాణ రాజ్యాధికార పార్టీ (టీఆర్పీ) సిద్ధాంతాలు,తీన్మార్ మల్లన్న పోరాటాలకు ఆకర్షితులై జిల్లాలో పలువురు నాయకులు పార్టీలో చేరారు. భూపాలపల్లి పట్టణంలోని ఎల్‌బీనగర్‌కు చెందిన ఆర్ఎంపీ డాక్టర్ కుమారస్వామి, నందిగామకు చెందిన ప్రభాకర్ గౌడ్‌తో పాటు పలువురు కార్యకర్తలు పార్టీ తీర్థం పుచ్చుకున్నారు.వారికి రాష్ట్ర మహిళా అధ్యక్షురాలు పటేల్ వనజ,జిల్లా అధ్యక్షుడు రవి పటేల్ గులాబీ కండువాలు కప్పి పార్టీలోకి సాదరంగా ఆహ్వానించారు.ఈ సందర్భంగా పటేల్ వనజ,రవి పటేల్ మాట్లాడుతూ... బడుగు,బలహీన వర్గాలైన బీసీ,ఎస్సీ,ఎస్టీ,మైనారిటీలకు రాజ్యాధికారం సాధించడమే లక్ష్యంగా పార్టీ పనిచేస్తోందని తెలిపారు.ప్రజాస్వామ్య పద్ధతిలో రాజ్యాంగబద్ధంగా రాజ్యాధికారం సాధించేందుకు ప్రజలంతా కలిసి రావాలని పిలుపునిచ్చారు.క్రమశిక్షణతో పనిచేస్తూ జిల్లాలో పార్టీని మరింత బలోపేతం చేయాలని కార్యకర్తలకు సూచించారు.అనంతరం పార్టీలో చేరిన నేతలు మాట్లాడుతూ... తీన్మార్ మల్లన్న ఆశయాలకు అనుగుణంగా పనిచేస్తూ పార్టీ విస్తరణకు కృషి చేస్తామని స్పష్టం చేశారు.ఈ కార్యక్రమంలో జిల్లా నాయకులు ప్రణీత్,సంతోష్,శ్రీకాంత్,రాంబాబు తదితరులు పాల్గొన్నారు.

# దాల్మియా ప్రభావిత గ్రామస్తుల పరిహారం, పునరావాసం, అభివృద్ధి పనులను వేగవంతం చేయాలి..!

## కలెక్టర్ డా. శ్రీధర్ చెరుకూరి
## సంస్థ యాజమాన్యం, రెవెన్యూ అధికారులతో సమీక్ష సమావేశం



బిఎన్ఎస్ న్యూస్ కడపజిల్లా ఆగస్టు 19: దాల్మియా పరిశ్రమ ప్రభావిత గ్రామాల ప్రజలకు ప్రజాభిప్రాయ సేకరణ సందర్భంగా ఇచ్చిన ప్రతి హామీని నిబంధనల మేరకు అమలు చేసి, వారికి పూర్తి న్యాయం జరిగేలా చర్యలను వేగవంతం చేయాలని జిల్లా కలెక్టర్ డా. శ్రీధర్ చెరుకూరి అధికారులను, దాల్మియా సంస్థ ప్రతినిధులను ఆదేశించారు. బుధవారం సాయంత్రం కలెక్టరేట్‌లోని తన ఛాంబర్‌లో జిల్లా కలెక్టర్ డా. శ్రీధర్ చెరుకూరి జాయింట్ కలెక్టర్ డా. నిధి మీనాతో కలిసి దాల్మియా సంస్థ యాజమాన్య ప్రతినిధులు, రెవెన్యూ, సంబంధిత శాఖల అధికారులతో కలెక్టర్ సమీక్ష నిర్వహించారు. గత ఏడాది నిర్వహించిన ప్రజాభిప్రాయ సేకరణ సందర్భంగా ఇచ్చిన హామీలు, తీసుకున్న నిర్ణయాల అమలు పురోగతిని అంశాల వారీగా సమీక్షించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ.. బాధిత ప్రజలకు అందాల్సిన పరిహారం, పునరావాస చర్యలు, అభివృద్ధి పనుల్లో జాప్యానికి తావులేకుండా సమన్వయంతో పనిచేయాలని స్పష్టం చేశారు. ఇటీవల జమ్మలమడుగు నియోజకవర్గం మైలవరం మండలం చిన్నకొమెర్ల లోని దాల్మియా సిమెంట్ పరిశ్రమను సందర్శించిన అనంతరం ఎమ్మెల్యే ఆదినారాయణ రెడ్డి, యువ నాయకుడు భూపేష్ రెడ్డితో కలిసి సమీపంలోని దుగ్గనపల్లె ఆలయం వద్ద ప్రభావిత గ్రామాల ప్రజలతో కలెక్టర్ ముఖాముఖి మాట్లాడారు. ప్రజలు తమ సమస్యలను వివరించడంతో, వాటి పరిష్కారానికి అవసరమైన చర్యలపై అధికారులతో సమగ్రంగా చర్చించారు. దుగ్గనపల్లె గ్రామ పునరావాసానికి ఇప్పటికే స్థల పరిశీలన పూర్తయిందని ఆర్డీవో శిరీష తెలిపారు. చిన్నకొమెర్ల గ్రామంలో సుమారు 10 ఎకరాల స్థలాన్ని గుర్తించి, 60 కుటుంబాలకు వసతి కల్పించేలా ఏర్పాట్లు చేస్తున్నట్లు వివరించారు. గండికోట రిజర్వాయర్ నిర్వాసితులకు అందించిన విధానంలోనే ఆర్ అండ్ ఆర్ ప్యాకేజీ పరిహారం అందించేందుకు అంగీకారం కుదిరిందని తెలిపారు. పునరావాస ప్రక్రియను వేగవంతం చేయాలని కలెక్టర్ ఆదేశించారు. పరిశ్రమ కాంపౌండ్ వాల్ కారణంగా వర్షాలు, వరదల సమయంలో సహజ నీటి ప్రవాహానికి అడ్డంకి ఏర్పడి వ్యవసాయ భూములు ముంపునకు గురవుతున్నాయన్న ఫిర్యాదులపై కూడా సమీక్షించారు. సమస్య పరిష్కారానికి వాగును మరింత విస్తరించాలని నిర్ణయించి, అంచనా వ్యయాన్ని సిద్ధం చేసి పనులను సాగునీటి శాఖకు అప్పగించినట్లు అధికారులు తెలిపారు. పరిశ్రమల నుంచి వెలువడే దుమ్ముతో పంటలు దెబ్బతింటున్న నేపథ్యంలో ప్రభావిత రైతులకు రాబోయే పంట కాలానికి ఎకరాకు రూ.10 వేల ఇన్‌పుట్ సబ్సిడీ అందించేలా చర్యలు చేపట్టాలని కలెక్టర్ సూచించారు. అవసరాన్ని బట్టి విత్తనాలు, ఎరువుల రూపంలో కూడా సహాయం అందించేలా ప్రక్రియ ప్రారంభించినట్లు అధికారులు తెలిపారు. నవాబుపేట ప్రాంతంలో మైనింగ్, బ్లాస్టింగ్ కారణంగా ఇళ్లు దెబ్బతింటున్నాయన్న ఫిర్యాదులపై క్షేత్రస్థాయి పరిశీలనతో సమగ్ర సర్వే నిర్వహించి నష్టాన్ని అంచనా వేయాలని కలెక్టర్ ఆదేశించారు. అలాగే స్థానిక యువతకు నైపుణ్యాభివృద్ధి శిక్షణ, ప్రజలకు ఉచిత వైద్య శిబిరాలు కొనసాగుతున్నట్లు అధికారులు తెలిపారు. సీఎస్ఆర్ నిధులతో చేపట్టాల్సిన అభివృద్ధి పనుల పురోగతిపైన సమీక్షించారు. ప్రజాభిప్రాయ సేకరణ సందర్భంగా ఇచ్చిన ప్రతి హామీని అమలు చేసేందుకు జిల్లా యంత్రాంగం కట్టుబడి ఉందని కలెక్టర్ చెరుకూరి స్పష్టం చేశారు. పునరావాసం, పరిహారం, వాగు విస్తరణ, పంట నష్టానికి సహాయం, దెబ్బతిన్న ఇళ్ల సర్వే తదితర చర్యలను వేగవంతం చేసి ప్రభావిత గ్రామాల ప్రజలకు న్యాయం జరిగేలా చూడాలని అధికారులను ఆదేశించారు. ఈ సమావేశంలో జమ్మలమడుగు ఆర్డీవో శిరీష, పొల్యూషన్ కంట్రోల్ బోర్డు ఈఈ సుధ, హౌసింగ్ పీడి రాజారత్నం, రెవెన్యూ అధికారులు, దాల్మియా సంస్థ యాజమాన్య ప్రతినిధులు, సంబంధిత శాఖల అధికారులు పాల్గొన్నారు.

# స్థానిక సంస్థల ఎన్నికలపై చంద్రబాబు వైఖరిని ప్రజలు గమనించాలి.

## వైయస్సార్సీపి మాజీ మేయర్ పాక సురేష్ కుమార్




బిఎన్ఎస్ న్యూస్ కడపజిల్లా ఆగస్టు 19:
కడప నగరంలోని మాజీ డిప్యూటీ సీఎం అంజద్ భాష క్యాంపు కార్యాలయంలో మాజీ మేయర్ పాక సురేష్ కుమార్, వైసీపీ మాజీ కార్పొరేటర్లు, బీసీ నేతలు మీడియా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా పాక సురేష్ కుమార్ మాట్లాడుతూ.. రాష్ట్రంలో స్థానిక సంస్థల ఎన్నికలు నిర్వహించాలనే ఆలోచన చంద్రబాబు ప్రభుత్వానికి లేదని విమర్శించారు. ఎన్నికలు నిర్వహించకుండా ఉండేందుకు లేనిపోని అడ్డంకులు సృష్టించే ప్రయత్నం జరుగుతోందన్నారు. ఇంచార్జిలతోనే పాలన సాగించాలనే నైజం చంద్రబాబుదని ఆరోపించారు. ఒకవైపు ఎన్నికలు నిర్వహిస్తామని చెబుతూనే, మరోవైపు ఎన్నికల కమిషనర్‌తో కోర్టులో కేసులు వేయించడం ద్వారా ఎన్నికలను ఆలస్యం చేసే ప్రయత్నం జరుగుతోందని అన్నారు. ప్రస్తుతం ముసాయిదా ఓటర్ల జాబితా ప్రకటించారని, ఎస్ఐఆర్ ప్రక్రియ పూర్తయిన అనంతరం ఎన్నికలు నిర్వహించడం మంచిదని అభిప్రాయపడ్డారు.

**బీసీలకు రాజకీయంగా పెద్దపీట వేసింది జగన్ మోహన్ రెడ్డి.**

బీసీలకు మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్ రెడ్డి ఎప్పుడో పెద్దపీట వేశారని పాక సురేష్ కుమార్ పేర్కొన్నారు. బీసీ రిజర్వేషన్లకు చట్టబద్ధత కల్పించిన తర్వాతే అవి పూర్తిస్థాయిలో అమలుకు నోచుకుంటాయని అన్నారు.

బీసీలను మభ్యపెట్టేందుకే 34 శాతం రిజర్వేషన్లు అమలు చేస్తామని ప్రభుత్వం చెబుతోందని విమర్శించారు. బీసీలను రాష్ట్రానికి వెన్నుముకగా భావించి, వారికి రాజకీయంగా ప్రాధాన్యత కల్పించిన ఘనత వైఎస్ జగన్ దేనన్నారు. బీసీలకు కార్పొరేట్ పదవుల్లో 48 శాతం వరకు అవకాశాలు కల్పించిన విషయాన్ని ప్రజలు గుర్తించాలని కోరారు. వైసీపీ ఎంపీలతో కలిసి బీసీ రిజర్వేషన్ బిల్లు పెట్టిన ఘనత కూడా వైఎస్ జగన్ దేనని పేర్కొన్నారు. కుల జనగణన నిర్వహించి, బీసీల రిజర్వేషన్లకు చట్టబద్ధత కల్పించాల్సిన అవసరం ఉందన్నారు. కోర్టుల్లో కేసులు వేయించడం, ఎన్నికల ప్రక్రియను ఆలస్యం చేయడం వంటి పరిణామాలను ప్రజలు గమనించాలని పాక సురేష్ కుమార్ సూచించారు. పచ్చ పత్రికలు ఎంతగా ప్రభుత్వాన్ని వెనకేసుకొచ్చినా ప్రజలు నమ్మే పరిస్థితిలో లేరని అన్నారు. బీసీలకు నిజంగా న్యాయం చేసింది ఎవరో ప్రజలు గుర్తించాలి. ఎన్నికల విషయంలో జరుగుతున్న పరిణామాలను ప్రజలు నిశితంగా గమనించాల్సిన అవసరం ఎంతైనా ఉందని కడప వైయస్సార్సీపి మాజీ మేయర్ పాక సురేష్ కుమార్ తెలిపారు.

# నల్లగొండ ను నెంబర్ వన్ గా చేస్తా

## : మంత్రి కోమటిరెడ్డి



నల్లగొండ (బిఎన్ఎస్): తెలంగాణలో నల్గొండ మున్సిపల్ కార్పొరేషన్ ను నంబర్ వన్ గా చేయాలన్నదే తన ధ్యేయమని , అందుకోసం ప్రభుత్వం తరఫున ఎన్ని నిధులైన ఖర్చు చేసేందుకు సిద్ధంగా ఉన్నామని రోడ్లు భవనాల శాఖామంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి అన్నారు... నల్గొండ జిల్లా కేంద్రంలో 24కోట్ల విలువైన రహదారుల నిర్మాణానికి మున్సిపల్ మేయర్ బుర్రి చైతన్య తో కలిసి మంత్రి శంకుస్థాపన, భూమిపూజ చేశారు.. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ... నల్గొండ మున్సిపల్ కార్పొరేషన్ లో 500 కోట్ల రూపాయలతో రహదారులు ,సిసి రహదారులు అభివృద్ధి చేస్తున్నామని , ట్రాఫిక్ రద్దీ నియంత్రించేందుకు 900కోట్లతో బైపాస్ నిర్మాణం చేపట్టామని అన్నారు. పట్టణానికి 24 గంటలు తాగునీరు అందించేందుకు 83 కోట్ల రూపాయలతోఇటీవల రాష్ట్ర ముఖ్యమంత్రి చేతుల మీదుగా శంకుస్థాపన చేసిన వాటర్ ప్లాంట్ పనులు నెల రోజుల్లో పూర్తిచేసి తాగునీరందిస్తామని అన్నారు. నల్లగొండ లెప్రసీ కాలనీలో 3 కోట్ల రూపాయలతో మంజూరు చేసిన సబ్ స్టేషన్ పనులు పురోగతిలో ఉన్నాయని అన్నారు. చారిత్రక ప్రదేశమైన ఛాయ సోమేశ్వరాలయ పునర్నిర్మానం కోసం ప్రభుత్వానికి 150కోట్లతో ప్రతిపాదనలు పంపించామని అన్నారు.

# రాపూరులో కార్డన్ అండ్ సెర్చ్ ఆపరేషన్

### 30 ద్విచక్ర వాహనాలు స్వాధీనం

### పలు అంశాలను ప్రజలకు వివరించిన రాపూరు సిఐ శ్రీనివాసరావు



నెల్లూరు జిల్లా రాపూరు(బిఎన్ఎస్): –నెల్లూరు జిల్లాలోని రాపూరు మండలంలోని రాపూరు పట్టణంలోని తూర్పు అగర్తకట్ట ప్రాంతంలో సీఐ శ్రీనివాసరావు ఆధ్వర్యంలో పోలీసు బలగాలు బుధవారం విస్తృత కార్డన్ అండ్ సెర్చ్ ఆపరేషన్ నిర్వహించాయి. సర్కిల్ ఎస్ఐలు, 20 మంది సిబ్బందితో కూడిన బృందం పూర్వ నేరస్థులు, అనుమానితుల ఇళ్లలో ఆకస్మిక తనిఖీలు చేపట్టారు. ఈ ఆపరేషన్‌లో సరైన పత్రాలు లేని 30 ద్విచక్ర వాహనాలను పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. అనంతరం సరైన రికార్డులు చూపించిన యజమానులకు వాహనాలను తిరిగి అప్పగించారు.?అనంతరం నిర్వహించిన అవగాహన సదస్సులో సీఐ శ్రీనివాసరావు మాట్లాడుతూ... ఎన్డీపీఎస్ చట్టం, ఎర్రచందనం అక్రమ రవాణా అరికట్టడం, మహిళల భద్రత, సైబర్ నేరాలు, ఆన్‌లైన్ మోసాలపై ప్రజలు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. బాల్య వివాహాల నిరోధం, పోక్సో చట్టం, హెల్మెట్ ధారణ, రోడ్డు భద్రతా నియమాలతో పాటు నేరాల నియంత్రణకు సీసీటీవీ కెమెరాల ప్రాముఖ్యతను వివరించారు. ప్రజలందరూ పోలీసులకు సహకరించాలని కోరారు. ఈ కార్యక్రమంలో రాపూరు ఎస్సై జె. తిరుమలరావు, కలువాయి ఎస్సై కోటయ్య, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

# మాంటిస్సోరి స్కూల్‌లో బుక్‌స్టాల్‌పై విచారణ చేపట్టాలి:కేవీపీఎస్





**బిఎన్ఎస్ న్యూస్ భూపాలపల్లి**

స్థానిక మాంటిస్సోరి స్కూల్‌లో విద్యార్థుల నుంచి పుస్తకాలు,యూనిఫామ్స్ పేరిట నగదు వసూలు చేస్తూ జీఎస్టీ బిల్లులు ఇవ్వకపోవడంపై అధికారులు సమగ్ర విచారణ జరిపి కఠిన చర్యలు తీసుకోవాలని కేవీపీఎస్ జిల్లా కార్యదర్శి ఆత్కూరి శ్రీధర్ డిమాండ్ చేశారు.బుధవారం ఆయన మాట్లాడుతూ... పాఠశాల సమయాల్లోనే 'మిలీనియం బుక్ స్టాల్' ద్వారా పాఠ్యపుస్తకాలు, టీషర్టులు,స్పోర్ట్స్ దుస్తులను విక్రయిస్తున్నారని ఆరోపించారు.సరైన పన్ను వివరాలు ఉండే జీఎస్టీ బిల్లులకు బదులుగా చేతిరాత రశీదులు ఇస్తూ నిబంధనలు ఉల్లంఘిస్తున్నారని పేర్కొన్నారు.ముందస్తు సమాచారం,పారదర్శక ధరల పట్టిక లేకుండా తల్లిదండ్రులపై కొనుగోళ్ల కోసం ఒత్తిడి తేవడం సరికాదన్నారు. పాఠశాలలో బుక్‌స్టాల్ నిర్వహణకు అనుమతులు ఉన్నాయా లేదా అనే విషయంపై విద్యాశాఖ, వాణిజ్య పన్నుల శాఖ అధికారులు వెంటనే తనిఖీలు చేపట్టాలని డిమాండ్ చేశారు. అనుమతులు లేకపోతే బుక్‌స్టాల్‌ను తక్షణమే మూసివేయాలని, తల్లిదండ్రులపై ఆర్థిక భారం మోపకుండా కొనుగోలు స్వేచ్ఛను కల్పించాలని ఆయన కోరారు.

# పాలకుర్తిలో ఘనంగా ప్రపంచ ఫోటోగ్రఫీ దినోత్సవం




**బిఎన్ఎస్ న్యూస్ పాలకుర్తి ఆగస్టు 19**

ప్రపంచ ఫోటోగ్రఫీ దినోత్సవాన్ని పురస్కరించుకుని జనగామ జిల్లా పాలకుర్తి మండల కేంద్రంలోని రాజీవ్ చౌరస్తాలో మండల ఫోటోగ్రాఫర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ప్రత్యేక కార్యక్రమం నిర్వహించారు.ఈ సందర్భంగా మండల ఫోటోగ్రాఫర్స్ అసోసియేషన్ అధ్యక్షుడు గుడికందుల నరేష్ ఆధ్వర్యంలో ఫోటోగ్రఫీ రంగానికి విశేష సేవలందించిన లూయిస్ దాగూర్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు.అనంతరం ఆయన మాట్లాడుతూ ఫోటోగ్రాఫర్లందరూ ఐకమత్యంతో ముందుకు సాగుతూ సంఘం అభివృద్ధికి కృషి చేయాలని కోరారు.అనంతరం సీనియర్ ఫోటోగ్రాఫర్ రాపోలు లక్ష్మణ్‌కు రెండు నిమిషాలు మౌనం పాటించి ఘనంగా నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో మండలానికి చెందిన పలువురు సీనియర్ ఫోటోగ్రాఫర్లు, ఫోటోగ్రాఫర్స్ అసోసియేషన్ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

# స్థానిక సంస్థల్లో 34% రిజర్వేషన్ కల్పించడం పట్ల హర్షం వ్యక్తం చేసిన బీసీ నాయకులు

### ఇచ్చిన మాట నిలబెట్టుకున్న కూటమి ప్రభుత్వం

కొత్తపేట(బిఎన్ఎస్)ఆగస్టు 18 : స్థానిక సంస్థల్లో బీసీలకు 34% రిజర్వేషన్ కల్పించడం పట్ల కొత్తపేట మండల బీసీ నాయకులు తెలిపారు .ఈ సందర్భంగా బీసీ నాయకులు మాట్లాడుతూ గతంలో ఉన్నటువంటి 34% రిజర్వేషన్ వైసీపీ ప్రభుత్వంలో 24% కు తగ్గించారు.

అప్పటి ముఖ్యమంత్రి నందమూరి తారక రామారావు బీసీల కొరకు కల్పించిన రిజర్వేషన్లను వైసీపీ ప్రభుత్వం తగ్గించడం వలన బీసీలు అనేక పదవులు కోల్పోయారని రిజర్వేషన్లు తగ్గించి బీసీలకు వైసిపి పార్టీ తీరని అన్యాయం చేసిందని ఈ సందర్భంగా అన్నారు.కూటమి ప్రభుత్వం ఏర్పడిన తరువాత మరలా 34% చేస్తామని ఇచ్చిన హామీని కూటమి ప్రభుత్వం నెరవేర్చింది. నిన్న జరిగిన క్యాబినెట్ సమావేశంలో ఆమోదం తెలిపి 34% చేసి మాట నిలబెట్టుకుందన్నారు .తెలుగుదేశం పార్టీ ఎప్పుడు బీసీలు అభ్యున్నతికి పాటుపడుతుందని మరోసారి రుజువు చేసిందని బీసీ నాయకులు తెలిపారు..రాజకీయంగా పురోగతి సాధించినప్పుడే సామాజిక వర్గాలు అభ్యున్నతి సాధిస్తాయన్నారు.స్థానిక సంస్థలలో 34% రిజర్వేషన్ కల్పించడం వలన బీసీలు రాజకీయంగా ముందుకు వెళ్ళ గలుగుతామని చెప్పారు.



అవకాశం కల్పించిన ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడుకి డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ కి మంత్రి నారా లోకేష్ కి ఈ సందర్భంగా బీసీ నాయకులు కృతజ్ఞతలు తెలియజేశారు..ఈ సమావేశంలో మాజీ జడ్పిటిసి రెడ్డి రామకృష్ణ మోడీకుర్రు సొసైటీ అధ్యక్షులు బొక్క వెంకట కుమార్ మాజీ సర్పంచ్ లు జక్కం చెట్టి చంటి కుడుపూడి వెంకటేశ్వరరావు మాజీ ఎంపీటీసీ చిట్టూరి ఆదినారాయణ గుబ్బల మూర్తి గుత్తుల సత్యనారాయణ జక్కం శెట్టి శ్రీనివాస్ మట్ట బాలు దూనబోయిన ప్రదీప్ చిట్టూరి శ్రీనివాస్ బొక్క రామకృష్ణ కుడుపూడి శ్రీనివాసరావు చిట్టూరి ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

# బీసీల రిజర్వేషన్ పెంపు పై పాలూరి హర్షం..



కొత్తపేట (బిఎన్ఎస్)ఆగస్టు 19 : స్థానిక సంస్థల ఎన్నికల్లో కూటమి ప్రభుత్వం బీసీలకు 34 శాతం రిజర్వేషన్ల ఇచ్చే నిర్ణయం తీసుకోవడం అభినందనీయమని కొత్తపేట నియోజకవర్గ బిఎల్ ఏ పాలూరి సత్యానందం హర్షం వ్యక్తం చేశారు.ముఖ్యమంత్రి చంద్రబాబుకు బీసీల తరుపున కృతజ్ఞతలు తెలిపారు. ఆంధ్రప్రదేశ్ కూటమి ప్రభుత్వం స్థానిక సంస్థల ఎన్నికల్లో బీసీలకు 34 శాతం రిజర్వేషన్లు కల్పించడం అభినందనీయమన్నారు. బీసీలకు రాబోయే స్థానిక సంస్థలనుండి రాజకీయ ప్రాతినిధ్యాన్ని మరింత పెంచే ఈ నిర్ణయం చారిత్రాత్మక నిర్ణయమని చెప్పారు .అటు కేంద్రంలో ఇటు రాష్ట్రంలో బీసీలకు సామాజిక న్యాయం, రాజకీయ సాధికారత కల్పించే దిశగా డబల్ ఇంజన్ సర్కార్ తీసుకున్న ఈ నిర్ణయం అభినందనీయమన్నారు.ఆనాడు దివంగత ముఖ్యమంత్రి ఎన్టీఆర్ బీసీలకు 20 శాతం రిజర్వేషన్లను అమల్లోకి తీసుకువచ్చిన విషయం గుర్తు చేశారు. అప్పుడు ఎన్టీఆర్ బీసీలకు రిజర్వేషన్లు కల్పించి వారి అభ్యున్నతికి బాటలు వేశారన్నారు. ఇప్పుడు కూటమిలో ముఖ్యమంత్రి చంద్రబాబు బీసీల రిజర్వేషన్ కోటాను 34 శాతానికి పెంచడం అభినందనీయమని కోన అన్నారు. స్థానిక సంస్థల్లో బీసీలకు అధిక ప్రాతినిధ్యం లభించడం ద్వారా గ్రామస్థాయి నుంచి బీసీలు మరింత బలోపేతం అయ్యే అవకాశం ఉంటుందని ఆయన పేర్కొన్నారు . ప్రజాప్రతినిధులుగా బీసీలు పెరగడంతో సమస్యలను పాలనలో మరింత సమర్థవంతంగా ప్రస్తావించేందుకు అవకాశం కలుగుతుందని తెలిపారు . బీసీల అభివృద్ధికి ప్రభుత్వం తీసుకుంటున్న చర్యలు వారికి మరింత భరోసా కల్పిస్తున్నాయన్నారు.

ఇచ్చిన మాటను నిలబెట్టుకుని బీసీల అండగా ఉన్నారని రాబోయే రోజుల్లో కూటమి ప్రభుత్వంలో సంక్షేమం, అభివృద్ధే లక్ష్యంగా సామాజిక న్యాయం లో భాగంగా బీసీలకు రాజకీయంగా, బీసీలకు అవకాశం కల్పించిన డబల్ ఇంజన్ సర్కార్ కు పాలూరి కృతజ్ఞతలు తెలిపారు .

# కాకినాడలో ఇండియన్ కోస్ట్ గార్డ్ అధికారులతో సమావేశమైన ఎంపీ హరీష్ బాలయోగి...



### ఓడలరేవు సముద్ర తీరంలో గల్లంతైన మత్స్యకారుల గాలింపు చర్యలు మరింత వేగవంతం చేయాలని కోరిన ఎంపీ హరీష్...

అమలాపురం (బిఎన్ఎస్)ఆగస్టు :19కోనసీమ జిల్లా ఓడలరేవు సముద్రంలో బోటుపై వేటకు వెళ్లి గల్లంతైన మత్స్యకారుల ఆచూకీ కోసం కూటమి ప్రభుత్వం మరియు అధికార యంత్రాంగం గాలింపు చర్యలు చేపట్టిందని అమలాపురం ఎంపీ గంటి హరీష్ బాలయోగి తెలిపారు. ఈ మేరకు గాలింపు చర్యలు మరింత వేగవంతం చేయాలని కాకినాడలోని ఇండియన్ కోస్ట్ గార్డ్ అధికారులను కలసి కోరారు. గల్లంతైన ఏడుగురు మత్స్యకారులను వీలైనంత త్వరగా గుర్తించేందుకు ఇండియన్ నేవీ, ఇండియన్ కోస్ట్ గార్డ్ మరియు ఇతర బృందాల ద్వారా గాలింపు చర్యలు ముమ్మరం చేసినట్లు చెప్పారు . ఈ విషయంపై ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు జిల్లా అధికారులతో సమీక్ష నిర్వహించి అధికారులను అప్రమత్తం చేశారని, అలాగే ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ సైతం ఈ ఘటనపై ప్రత్యేక దృష్టి సారించారన్నారు. వీలైనంత త్వరగా గల్లంతైన మత్స్యకారులను గుర్తించి వారి కుటుంబ సభ్యుల వద్దకు చేర్చేందుకు ప్రభుత్వం కృషి చేస్తుందని ఎంపీ హరీష్ బాలయోగి పేర్కొన్నారు.

# మహిళలు అన్ని రంగాలలో ఆర్థిక అభివృద్ధి సాధించాలి.

### శ్రీ దుర్గా మండల సమైక్య 18వ వార్షిక మహాసభలో -ఏపీఎం సీహెచ్ అలివేలు మంగ



**బిఎన్ఎస్ న్యూస్ మహబూబాబాద్ జిల్లా.**

స్వయం సహాయక సంఘాల మహిళలు తీసుకున్న రుణాలను సకాలంలో తిరిగి చెల్లించి ఆర్థిక క్రమశిక్షణ పాటించాలని, బకాయిలు లేని సంఘాలకే కొత్త రుణాలు మంజూరు చేసే అవకాశం ఉంటుందని మరిపెడ ఏపీఎం సీహెచ్ అలివేలు మంగ తెలిపారు. బుధవారం మరిపెడ మండల కేంద్రంలోని శ్రీదుర్గ మండల సమైక్య కార్యాలయంలో నిర్వహించిన 18వ వార్షిక మహాసభలో ఆమె ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు.ఈ సమావేశానికి మండల సమైక్య అధ్యక్షురాలు అజ్మీర వసంత అధ్యక్షత వహించారు.ఈ సందర్భంగా అలివేలు మంగ మాట్లాడుతూ మండలంలోని ఎక్కువ శాతం సంఘాలు సక్రమంగా పనిచేస్తున్నప్పటికీ, కొన్ని సంఘాల్లో ఒక్కరు లేదా ఇద్దరు సభ్యులు రుణాలు చెల్లించకపోవడంతో మొత్తం సంఘం డిఫాల్టర్‌గా మారే పరిస్థితి ఏర్పడుతోందన్నారు. అందువల్ల ప్రతి సభ్యురాలు బాధ్యతాయుతంగా వ్యవహరించి రుణాలను నిర్ణీత గడువులోపు చెల్లించాలని సూచించారు.

మహిళల ఆర్థిక స్వావలంబన, కుటుంబ ఆదాయ పెంపు, చిన్న వ్యాపారాల అభివృద్ధి, పాడి పరిశ్రమ, చిరు వ్యాపారాలు, కుటీర పరిశ్రమలు వంటి ఉపాధి అవకాశాలను ప్రోత్సహించేందుకు ప్రభుత్వం స్వయం సహాయక సంఘాల ద్వారా తక్కువ వడ్డీ రుణాలు, బ్యాంకు లింకేజీ, వడ్డీ రాయితీలు, వివిధ ఆర్థిక ప్రోత్సాహక పథకాలను అమలు చేస్తోందన్నారు. ఈ అవకాశాలను సద్వినియోగం చేసుకొని మహిళలు ఆర్థికంగా ఎదగాలని పిలుపునిచ్చారు.డీఆర్‌డీఏ ఆధ్వర్యంలో మహిళా సంఘాలకు సామర్థ్యాభివృద్ధి శిక్షణలు, ఆర్థిక నిర్వహణపై అవగాహన కార్యక్రమాలు, బ్యాంకులతో సమన్వయం, రుణాల మంజూరు, జీవనోపాధి కార్యక్రమాలకు ప్రోత్సాహం, మార్కెటింగ్ అవకాశాల కల్పన వంటి చర్యలు చేపడుతున్నట్లు తెలిపారు. సంఘాలు బలోపేతం కావడం ద్వారా మహిళల కుటుంబాలతో పాటు గ్రామీణ ఆర్థిక వ్యవస్థ కూడా మరింత బలపడుతుందన్నారు.ప్రతి నెల సంఘ సమావేశాలను క్రమం తప్పకుండా నిర్వహించి పొదుపు, రుణాల వినియోగం, తిరిగి చెల్లింపులపై సమీక్ష నిర్వహించాలని సూచించారు. ప్రభుత్వం మహిళా సాధికారత కోసం అందిస్తున్న అవకాశాలను దుర్వినియోగం చేయకుండా అభివృద్ధికి వినియోగించుకోవాలని కోరారు,ఈ సమావేశంలో మండల సమైక్య కార్యదర్శి మంజుల, కోశాధికారి కృష్ణవేణి, సీసీలు కె. మల్లేశం, జి. చందులాల్, ఈ. నరసయ్య, బి. శ్రీను, బి. శ్రీరాములు, ఆఫీస్ ఆడిటర్ బి. రజిత, ఏ. విజయ్ కుమార్,మహిళా సంఘాల సభ్యులు తదితరులు పాల్గొన్నారు.



# పాలకుర్తి పట్టణ బీఆర్ఎస్ సీనియర్ నాయకుడు జీడి మనోహర్‌కు పితృవియోగం

**బిఎన్ఎస్ న్యూస్ పాలకుర్తి ఆగస్టు 19**

పట్టణ బీఆర్ఎస్ సీనియర్ నాయకుడు జీడి మనోహర్ తండ్రి జీడి సోమయ్య మృతి చెందడంతో ఆయన కుటుంబంలో విషాదం నెలకొంది. విషయం తెలుసుకున్న పాలకుర్తి బీఆర్ఎస్ మాజీ మండల అధ్యక్షుడు పసునూరి నవీన్ బాధిత కుటుంబాన్ని పరామర్శించి తన ప్రగాఢ సానుభూతిని తెలిపారు.అదేవిధంగా పాలకుర్తి మేజర్ గ్రామపంచాయతీ సర్పంచ్ విజయ నాగన్న గౌడ్, ఉపసర్పంచ్ గాదెపాక కిరణ్‌తో పాటు వార్డు సభ్యులు మామిళ్ల కవిత--శోభన్‌బాబు, దాసరి అనూష--మధు, కమ్మగాని సుధాకర్, కత్తి దస్తగిరి, కాటబత్తిని రమేష్, కోల నారాయణ, రేపాల అశోక్, గాదెపాక శ్రీనివాస్, కమ్మగాని వెంకటేశ్వర్లు, రాజ్ మహమ్మద్ తదితరులు జీడి సోమయ్య కుటుంబ సభ్యులను పరామర్శించారు.ఈ సందర్భంగా మృతుడి కుటుంబ సభ్యులకు తమ ప్రగాఢ సానుభూతిని తెలియజేస్తూ, ఈ విషాదాన్ని తట్టుకునే మనోధైర్యాన్ని ఆ భగవంతుడు కుటుంబ సభ్యులకు ప్రసాదించాలని వారు ప్రార్థించారు.